aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక

నమస్తే

# మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

శనివారం 14-02-2026 సంపుటి : 01 సంచిక : 19 పేజీలు : 08 వెల: ₹5/- RNI NO : TGTEL/26/A0738

Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com




అధికార పార్టీకి రాజకీయ ప్రత్యర్థి గులాబీ పార్టీనే!

## మున్సిపల్ ఎన్నికల్లో అధికార

# కాంగ్రెస్ హవా

**అత్యధిక మున్సిపల్ లో హస్తం పార్టీ పాగా**

- 64 మున్సిపాలిటీలతో ముందంజ
- 13 మున్సిపాలిటీలను దక్కించుకున్న బీఆర్ఎస్
- 7 కార్పోరేషన్లలో నాలుగింట కాంగ్రెస్ గెలుపు
- నిజామాబాద్, కరీంనగర్‌లో బీజేపీ ఆధిక్యం
- కొత్తగూడెంలో సత్తా చాటిన సీపీఐ
- బోణీ కొట్టిన తెలంగాణ జాగృతి





హైదరాబాద్, -13 ఫిబ్రవరి (మహాప్రభ)

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2,582 వార్డుల్లో ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో 1,347 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో 64 మున్సిపాలిటీలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. ఇక బీఆర్ఎస్ 717 వార్డుల్లో గెలుపొందింది. దాంతో 13 మున్సిపాలిటీలను ఆ పార్టీ దక్కించుకుంది. బీజేపీ 261 వార్డుల్లో గెలుపొందారు. నారాయణపేట మున్సిపాలిటీని ఆ పార్టీ దక్కించుకుంది. స్వతంత్ర అభ్యర్థులు.. 256 వార్డుల్లో విజయం సాధించారు. 8 మున్సిపాలిటీల్లో మాత్రం ఏ పార్టీకి పూర్తి స్థాయి మెజార్టీ రాలేదు. దీంతో హంగ్ ఏర్పడింది.

-మిగతా 3 లో





## అభివృద్ధి, సంక్షేమానికే

# ప్రజలు పెద్దపీట

- బీఆర్ఎస్, బీజేపీ కట్టు కథలు నమ్మలేదు
- అత్యున్నత ప్రమాణాలతో పాలనను అందిస్తాం
- ప్రెస్ మీట్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్ -13 ఫిబ్రవరి (మహాప్రభ)

రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ ఎన్నికల్లో 83 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంకా కొంత సమాచారం రావాల్సి ఉందనీ, తమ స్థానాలు మరిన్ని పెరుగుతాయని అన్నారు. స్వతంత్రులు ఇతర పార్టీల వారు తమ పార్టీతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా

-మిగతా 3 లో

## మెరుగైన ఫలితాలు

# సాధించాం

**కాంగ్రెస్, బీజేపీలను నిరోధించడమే లక్ష్యం**


- సింగరేణిలో దోపిడీకి అడ్డుకట్ట వేయాలి
- కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతు
- మా అభ్యర్థులను బెదిరిస్తున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్-13 ఫిబ్రవరి (మహాప్రభ)

మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) అన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా అండగా నిలబడ్డ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధికార పార్టీ ఎన్ని రకాలుగా బెదిరింపులు, దాడులు, ప్రలోభాలకు గురిచేసిందనీ, ప్రజల మనసు గెలవడంలో విఫలమైందని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో నాలుగు వేలకుపైగా సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ గెలిచిందన్నారు.

-మిగతా 3 లో



## రష్యా నుంచి 288 ఎస్-400

# క్షిపణుల కొనుగోలు

- రూ.10,000 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్
- మరింత పటిష్టం కానున్న భారత్ రక్షణ రంగం

న్యూఢిల్లీ,-13 ఫిబ్రవరి (మహాప్రభ)

భారత రక్షణరంగ పటిష్టత దిశగా మరో కీలక ముందడుగు పడింది. రష్యా నుంచి 288 ఎస్-400 క్షిపణుల కొనుగోలుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డిఫన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సుమారు రూ.10,000 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో జరిగే ఈ కొనుగోళ్లలో 120 స్వల్ప శ్రేణి క్షిపణలు, 168 సుదీర్ఘ శ్రేణి క్షిపణలు ఉన్నాయి. ఇప్పటికే కాంట్రాక్ట్ జరిగిన మరో రెండు ఎస్-400 వ్యవస్థలు ఈ ఏడాది జూన్, నవంబర్‌లో భారత్‌కు అందనున్నాయి. ఆపరేషన్ సిందూర్' సమయంలో ఉపయోగించిన క్షిపణుల నిల్వలను పునరుద్ధరించడం, వాయి రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడం తాజా కొనుగోళ్ల ముఖ్య ఉద్దేశంగా డిఫెన్స్ వర్గాలు తెలిపాయి

-మిగతా 3 లో



## ఇండియా పాస్‌పోర్ట్

# ర్యాంకింగ్ మెరుగు.

- తాజా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో మన పాస్‌పోర్ట్ 75వ స్తానం
- గత ఏడాది ఇదే సమయంలో ఇండియా పాస్‌పోర్ట్ 85వ స్తానం
- అంటే ఇప్పుడు ర్యాంకింగ్‌లో 10 స్థానాలు ఎగబాకింది
- ఫ్రీ వీసా రద్దు చేసి షాకిచ్చిన రెండు దేశాలు


న్యూఢిల్లీ,-13 ఫిబ్రవరి (మహాప్రభ)

హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో ఇండియా ర్యాంకింగ్ పెరిగింది. అంటే మన పాస్‌పోర్ట్ విలువ పెరిగింది. అయినా, ఇండియాకు ఫ్రీ వీసా ఇచ్చే దేశాల సంఖ్య తగ్గింది. తాజాగా రెండు దేశాలు ఇండియన్స్‌కు ఇప్పటిదాకా ఉన్న ఫ్రీ వీసా సౌకర్యాన్ని ఇటీవల రద్దు చేశాయి. ఇరాన్, బొలీవియా దేశాలు ఇండియాకు ఫ్రీ వీసా సౌకర్యాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. తాజా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో మన పాస్‌పోర్ట్ 75వ స్తానంలో నిలిచింది.గత ఏడాది ఇదే సమయంలో 85వ స్తానంలో ఉంది. అంటే ఇప్పుడు ర్యాంకింగ్‌లో 10 స్థానాలు ఎగబాకింది. గత జనవరిలో 80 వ ర్యాంక్‌కు చేరుకోగా, ఇప్పుడు మరో ఐదు ర్యాంకింగ్స్ మెరుగుపడి 75వ ర్యాంక్‌లో ఉంది. ఇదే సమయంలో మన దేశానికి ఫ్రీ

-మిగతా 3 లో

## ఆరావళి పర్వతాల్ని తాకనీయం..

- హర్యానా ప్రభుత్వానికి సుప్రీం కోర్టు హెచ్చరిక
- ఆరావళి పర్వతాల పరిధిలో జూ సఫారి ఏర్పాటు చేయాలనే హర్యానా ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టు వ్యతిరేకించింది



న్యూఢిల్లీ,-13 ఫిబ్రవరి (మహాప్రభ)

ఆరావళి పర్వతాల్ని తాకడానికి కూడా అనుమతించబోమని భారత సుప్రీం కోర్టు హెచ్చరించింది. ఆరావళి పర్వతాల పరిధిలో జూ సఫారి ఏర్పాటు చేయాలనే హర్యానా ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టు వ్యతిరేకించింది. అక్కడ ఎలాంటి చర్యలకు అనుమతించబోమని తేల్చిచెప్పింది. ఆరావళి పర్వాతాల పరిధిలో జూ సఫారి ఏర్పాటు చేయాలని హర్యానా ప్రభుత్వం నిర్ణయించింది.

-మిగతా 3 లో

## ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

- మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో దశ
- చివరి రోజూ ప్రతిపక్షాల ఆందోళనలు
- అమెరికాతో ట్రేడ్ డీల్, ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై నిరసనలు
- పలు అంశాలపై కేంద్రాన్ని నిలదీసిన సభ్యులు



న్యూఢిల్లీ -13 ఫిబ్రవరి (మహాప్రభ)

మోడీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను, భద్రతను తాకట్టు పెట్టిందని ప్రతిపక్షాలు నిరసనలు వ్యక్తం చేసిన తొలి దశ బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, కేంద్ర బడ్జెట్‌పై చర్చ ఉభయ సభల్లో జరిగింది. ఈ రెండు అంశాలపై చర్చల సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నిలదీశాయి. లోక్‌సభలో ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ బిల్లు ఆమోదం పొందింది.

-మిగతా 3 లో

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ

# బలపడింది

**ఎక్కువ ఓట్లు..సీట్లు సాధించుకోగలిగాం**

- కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కై ఓడించాయి
- అయినప్పటికీ తాము ఆశించిన ఫలితా లే సాధించాం
- దాదాపు 250 కౌన్సి లర్స్, 50 మంది కార్పొరేటర్లను తమ పార్టీ గెలిచింది
- బీఆర్ఎస్ పైనుంచి కిందికి పడిపోయిం దనీ, బీజేపీ కింది నుంచి పైకి లేచింది
- బీజేపీ అధ్యక్షులు రాంచందర్‌రావు



హైదరాబాద్ -13 ఫిబ్రవరి (మహాప్రభ)

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కై తమ పార్టీని ఓడించాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు చెప్పారు. అయినప్పటికీ తాము ఆశించిన ఫలితా లే సాధించామని అన్నారు. దాదాపు 250 కౌన్సి లర్స్, 50 మంది కార్పొరేటర్లను తమ పార్టీ గెలి చిందని చెప్పారు. శుక్రవారం హైదరబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ముఖ్య అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్, ఇతర నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు.

-మిగతా 3 లో



## కొత్త కార్యాలయంలోకి

# ప్రధానమంత్రి

**సేవాతీర్థ కాంప్లెక్స్ ప్రారంభం**

న్యూఢిల్లీ -13 ఫిబ్రవరి (మహాప్రభ)

: నూతన ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ)తో పాటు నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్, క్యాబినేట్ సెక్రటేరియట్‌లు ఉన్న సేవాతీర్థ కాంప్లెక్స్‌ను శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ప్రస్తుతం రైసినా హిల్‌లోని సౌత్‌బ్లాక్‌లో ఉన్న పిఎంఓను ఈ కాంప్లెక్స్‌కు తరలించనున్నారు. అలాగే, ఢిల్లీలో వివిధ ప్రదేశాల్లో ఉన్న క్యాబినేట్ సెక్రటేరియట్, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌ను కూడా ఈ కాంప్లెక్స్‌కు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ "పౌరులే దేవుళ్ళు" అనేది మా పని సంస్కృతి. "సేవాతీర్థం"లో తీసుకునే ప్రతి నిర్ణయం దేశపౌరుల జీవితాలను మెరుగుపరుస్తుందన్నారు.

-మిగతా 3 లో

## బంగ్లాదేశ్ ఎన్నికల్లో

# బీఎన్పీ ఘనవిజయం

- మొత్తం 299 స్థానాల్లో 212 చోట్ల గెలుపు
- ప్రధానిగా ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహమాన్!
- ఆయన నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం
- అవామీ లీగ్‌పై ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధం
- షేక్ హసీనాను అప్పగించాలనే డిమాండ్ పునరుద్ఘాటన



ఢాకా :-13 ఫిబ్రవరి (మహాప్రభ)

బంగ్లాదేశ్ నేషలిస్ట్ పార్టీ (బీఎన్పీ) ఘన విజయాన్ని సాధించింది. బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 299 స్థానాలకు గానూ ఆ పార్టీ 212 చోట్ల విజయం సాధించింది. దీంతో దాదాపు 20 ఏండ్ల తర్వాత బీఎన్పీ బంగ్లాదేశ్‌లో మళ్లీ అధికారం చేపట్టబోతోంది. చివరగా 2006లో ఆ పార్టీ బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని నడిపింది. తాజాగా బీఎన్పీ అఖండ విజయంతో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహమాన్ ఆ దేశ ప్రధానమంత్రి కాబోతున్నారు. ఆయన నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు బీఎన్పీ వర్గాలు తెలిపాయి. దీంతో హసీనా పాలన అనంతరం బంగ్లాదేశ్‌లో కొన్నేండ్ల తర్వాత కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నది. అయితే, భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి, అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనాను అప్పగించాలనే డిమాండ్‌ను బీఎన్పీ పునరుద్ఘాటించింది. ఈ విషయమై తమ వైఖరిలో ఎలాంటి మార్పూ ఉండబోదని తేల్చిచెప్పింది. విచారణకు ఆమెను భారత్ అప్పగించాలని స్పష్టం చేసింది.

-మిగతా 3 లో

నమస్తే మహాప్రభ

# మణిపూర్‌లో మరోసారి చెలరేగిన హింస..

## రెండు ఇండ్లు దహనం చేసిన ఆందోళనకారులు



**న్యూఢిల్లీ,-13ఫిబ్రవరి (మహాప్రభ)**
ఆందోళనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. గురువారం ఉఖ్రుల్ జిల్లాలోని, లిటన్ ఏరియాలో ఆందోళనకారులు రెండు ఇండ్లను తగలబెట్టారు. స్థానికంగా ఉన్న సరీఖాంగ్ గ్రామంలో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో ఈ హింసాత్మక ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. అంతకుముందు 24 గంటలపాటు మణిపూర్‌లో ప్రశాంత వాతావరణమే కొనసాగింది.కానీ, గురువారం తిరిగి హింస చెలరేగింది. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు మోహరించి ఉన్నప్పటికీ కొన్ని చోట్ల ఆందోళనలు ఆగడం లేదు. మరోవైపు ఉదయం ఎనిమిది గంటల సమయంలో తుపాకీ కాల్పుల మోతలు కూడా వినిపించాయని పోలీసులు తెలిపారు. అయితే, ఎవరూ గాయపడటం లేదా మరణించడం వంటివి తమ దృష్టికి రాలేదన్నారు. తాజా హింసకు ఈ ప్రాంతంలోని రెండు వర్గాలకు చెందిన వారు మద్యం సేవించడమే కారణం. ఆదివారం రాత్రి తంకుల్ నాగా, కుకీ తెగలకు చెందిన వారు మద్యం మత్తులో గొడవపడ్డారు. సమీప గ్రామాలకు చెందిన ఈ రెండు వర్గాల వారి మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర రూపం దాల్చింది. ఈ హింసలో ఇరు వర్గాలకు చెందిన 40 ఇండ్లను ఆందోళనకారులు దహనం చేశారు.వెంటనే స్పందించిన పోలీసులు ఈ ప్రాంతంలో ఘర్షణలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా కర్ఫ్యూ విధించారు. లిటన్ ఏరియాతోపాటు జిల్లా మొత్తం ఇంటర్నెట్ తొలగించారు. అయినప్పటికీ కుకీ తెగకు చెందిన మహిళలు చురాచంద్‌పూర్ జిల్లాలో భారీ నిరసనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎల్ఎం ఖవుతే ప్రభుత్వంలో చేరడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఇంకా అనేక చోట్ల నిరసనలు జరుగుతున్నాయి.


# డబ్బులు తీసుకోండి.. 'విజిల్'కు అండగా నిలవండి..

## డీఎంకే డబ్బుల పంపిణీపై విజయ్



**న్యూఢిల్లీ,-13ఫిబ్రవరి (మహాప్రభ)**
తమిళనాడులోని మహిళలకు డీఎంకే ప్రభుత్వం రూ.5,000 అకౌంట్లో వేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ అంశంపై టీవీకే పార్టీ అధినేత, నటుడు విజయ్ స్పందించారు. ఎప్పుడూ లేనిది ఇప్పుడు ఒకేసారి అడ్వాన్స్‌గా డబ్బులు వేయడం ఏంటని ప్రశ్నించారు. అంతేకాదు.. మహిళలు ఆ డబ్బులు తీసుకుని, తన పార్టీ టీవీకేకు అండగా నిలవాలని సూచించారు. తన విజిల్ గుర్తు అధికార పార్టీని భయపెడుతోందని, అందువల్లే ఈ డబ్బులు పంపిణీ చేశారని విజయ్ అభిప్రాయపడ్డారు.మహిళలకు ప్రతి నెలా ఇవ్వాల్సిన రూ.1,000ని ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి రూ.3 వేలతోపాటు, సమ్మర్ బొనాంజా కింద మరో రూ.2,000 కలిపి రూ.5 వేలు అకౌంట్లలో వేశారు. అయితే, వచ్చే వేసవిలో జరగనున్న ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకే డీఎంకే ఆధ్వర్యంలోని స్టాలిన్ ప్రభుత్వం ఈ పని చేసిందని టీవీకే సహా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ మేరకు ఎక్స్ వేదికగా విజయ్ ఈ అంశంపై స్పందించారు. "సడెన్‌గా సమ్మర్ బొనాంజా పేరిట రూ.2 వేలు అదనంగా ఎందుకిచ్చారు. ఇది ప్రజల డబ్బుతో ఓట్లను కొనుగోలు చేయడమే. ప్రతి ఏడాది సమ్మర్ వస్తుంది కదా.. కానీ, ఈసారి మాత్రమే అదనంగా డబ్బులు అకౌంట్లో వేశారు. ప్రతి నెలా రూ.15వ తారీఖున పడే డబ్బులు ఈసారి మాత్రం 13వ తేదీనే ఎందుకు ఇచ్చారు..?కారణం మా విజిల్ గుర్తు. ప్రతి ఇంట్లో, వీధిలో విజిల్ శబ్దాలు మోగుతున్నాయి. ఆ భయంతోనే మహిళలకు డబ్బులు ఇచ్చారు. మేం బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతున్నామని, విజయం సాధించబోతున్నామని, ప్రభుత్వంతో బాగా పని చేయించగలమని దీని ద్వారా రుజువైంది. నేను మంచి పాలన అందిస్తా. నాకు అనుభవం ఉందా అని అడుతున్నారు. మీకు మాత్రం అవినీతిలో తప్ప అనుభవం ఉందా" అని విజయ్ ప్రశ్నించారు. డీఎంకే ప్రభుత్వం వేసిన డబ్బులు తీసుకుని, తమ పార్టీకి అండగా నిలవాలని కోరాడు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ విజయ్ దూకుడు పెంచారు. అధికార డీఎంకేతోపాటు కేంద్రంలోని బీజేపీపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. వరుసగా ప్రచార కార్యక్రమాలతో దూసుకెళ్తున్నారు. మరోవైపు అధికార డీఎంకే మాత్రం తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ప్రయత్నిస్తోంది.


# బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు



**న్యూఢిల్లీ,-13ఫిబ్రవరి (మహాప్రభ)**
బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్‌వీర్‌ను, అతడి దగ్గర పనిచేస్తున్న వారినీ చంపేస్తానని బిష్ణోయ్ అనుచరుడి పేరుతో ఓ దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి ని కూడా ఇదే తరహాలో బెదిరించాడు. ఈ మేరకు వాట్సాప్‌లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం.ఈ బెదిరింపు సందేశంతో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్లను అంగీకరించకపోతే ఆ సెలెబ్రిటీలతోపాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు. భవిష్యత్తులో ఏడు తరాలకు గుర్తుండి పోయేలా హత్య జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు. 'రణ్‌వీర్ సింగ్.. భవిష్యత్తులో ఏడు తరాలకు గుర్తుండిపోయేలా నిన్ను హత్య చేస్తాం. నువ్వు మా బెదిరింపులను లెక్క చేయకపోగా మిగతా వారికీ ఉచిత సలహాలు ఇస్తున్నావు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నావు. నువ్వు కూడా ఓ కంప్లెయింట్ చేసినట్టున్నావు. పర్వాలేదు. ఇక నీకు మామూలుగా చెప్పం. నీ దగ్గర ఎవరెవరు పనిచేస్తున్నారు.. వారు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళతారు..? వారి కుటుంబాలు ఎక్కడ ఉంటున్నాయనే వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి. వారితో మొదలు పెడతాం. ఒక్కొక్కరినీ టార్గెట్ చేసి చంపేస్తుంటే అప్పుడు నీకు తెలిసివస్తుంది. నీకు ఇంకా టైమ్ ఉంది. హత్యలు మొదలయ్యేలోపే మేలుకో' అంటూ దుండగుడు తన ఆడియో సందేశంలో బెదిరించాడు. దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇది వర్తిస్తుందని అన్నాడు.

# 29కి పెరిగిన వివాహ సగటు వయసు..

## 43 శాతం పెరిగిన పునర్వివాహాలు



**న్యూఢిల్లీ,-13ఫిబ్రవరి (మహాప్రభ)**
గత దశాబ్ద కాలంలో భారత దేశంలో వివాహ సగటు వయసు 27 నుంచి 29కి పెరిగింది. అలాగే పునర్వివాహం చేసుకునే వారి సంఖ్య 43 శాతం పెరిగింది. ఈ కొత్త గణాంకాలు భాగస్వామి ఎంపిక, నిబద్ధతలో వచ్చిన మార్పులను సూచిస్తున్నాయని గురువారం వెలువడిన ఒక నివేదిక వెల్లడించింది. మ్యాట్రిమోని సంస్థ జీవన్‌సాథీ 2016 నుంచి 2025 వరకు 30 వేల మందికి పైగా వ్యక్తులతో జరిపిన సర్వే ప్రకారం వివాహ సగటు వయసు 27 నుంచి 29కి పెరిగింది. 50 శాతం మంది పెండ్లి సంబంధాలు చూడటం 29 నుంచే మొదలు పెడుతున్నారు.ముందస్తు వివాహాల కంటే ఆర్థిక స్థిరత్వం, కెరీర్‌లో ఎదుగుదల, వ్యక్తిగత సంసిద్ధత అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అలాగే పునర్వివాహం చేసుకునే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2016లో వీరి సంఖ్య 11 శాతం ఉండగా అది 43 శాతం పెరిగి 2025 నాటికి 16 శాతానికి చేరుకుంది. వివాహానికి కులం ముఖ్యమైన అంశంగా 2016లో 91 శాతం మంది భావించగా, 2025 నాటికి ఇది 54 శాతానికి పడిపోయింది. ఉద్యోగ, వృత్తులలో తమ కంటే ఎక్కువ సంపాదించే మహిళలను వివాహం చేసుకోవడం తమకు అంగీకారమేనని 87 శాతం మంది పురుషులు పేర్కొనగా, తమ కంటే తక్కువ సంపాదన ఉన్న వ్యక్తులను పెండ్లి చేసుకోవడానికి 15 శాతం మంది మహిళలు సమ్మతి తెలిపారు.

# రష్యాలో వాట్సాప్‌పై నిషేధం



**మాస్కో -13ఫిబ్రవరి (మహాప్రభ)**
తమ దేశ చట్టాలను పాటించనందుకు మెటాకు చెందిన వాట్సాప్ సేవలను తమ దేశంలో బ్లాక్ చేసినట్టు రష్యా ప్రభుత్వ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ గురువారం వెల్లడించారు. అంతకుముందు తమ యాప్‌ను నియంత్రించేందుకు రష్యా ప్రభుత్వ అధికారులు ప్రయత్నించారని వాట్సాప్ వెల్లడించింది.తమ మెసేజింగ్ యాప్‌ను అరికట్టడానికి రష్యా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ ప్రకటించిన వెంటనే వాట్సాప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

# జమ్మూకాశ్మీర్‌లో 32,000కు పైగా క్యాన్సర్ కేసులు




**శ్రీనగర్ -13ఫిబ్రవరి (మహాప్రభ)**
గత మూడేళ్లలో కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకాశ్మీర్‌లో 32,000కు పైగా క్యాన్సర్ కేసులు రికార్డయ్యాయి. అత్యధికంగా నోటి, రొమ్ము, ఊపిరితిత్తులు, గర్భాశయ, ప్రొస్టేట్ మరియు పాంక్రియాటిక్ క్యాన్సర్‌లు సర్వసాధారణంగా ఉన్నాయి. పిడిపి ఎమ్మెల్యే వహీద్ పరా అడిగిన ప్రశ్నకు జమ్మూకాశ్మీర్ ఆరోగ్య మంత్రి సకీనా ఇటు అసెంబ్లీకి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. గత మూడేళ్లలో 32,425 క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని, అత్యధిక కేసులు కాశ్మీర్ నుండి రికార్డయినట్లు తెలిపారు. అధికారిక సమాచారం ప్రకారం..2021-2024 మధ్య మూడేళ్లలో కాశ్మీర్ లోయలో 25,621 కేసులు నమోదయ్యాయి. పురుషుల్లో 4,333, మహిళల్లో 3,688 కేసులతో కలిపి 2021లో 8,021కేసులు రికార్డయ్యాయి. 2023లో 8,621 కేసులు (పురుషులు 4,685,మహిళలు 3,936), 2024లో 8,979 కేసులు (పురుషులు 4,789, మహిళలు 4,190) నమోదయ్యాయి. అలాగే 2023-2025 మధ్య జమ్మూ ప్రాంతంలో 6,804 క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. వాటిలో 2023లో మొత్తం 2,026 కేసులు (1,177 పురుషులు, 859 మహిళలు), 2024లో 2,187 కేసులు (1,248పురుషులు, 939మహిళలు), 2025లో 2,581 క్యానర్ కేసులు (1,116 పురుషులు, 1,465 మహిళలు) రికార్డయ్యాయి.జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. నీతి అయోగ్ , ఐసిఎంఆర్‌లతో కలిసి జెకె ప్రభుత్వం క్యాన్సర్ నియంత్రణ వ్యూహాన్ని రూపొందిస్తుందని అన్నారు.

# నాలుగు కార్లలో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం..

## -వీడియో రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్



**భోపాల్:13ఫిబ్రవరి (మహాప్రభ)**
ఒక విద్యార్థినిపై నాలుగు కార్లలో సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వీడియో రికార్డ్ చేసి బెదిరించడంతోపాటు డబ్బుల కోసం ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక బాలిక 11వ తరగతి చదువుతున్నది. పరిచయం ఉన్న ఇద్దరు వ్యక్తులు నాలుగు కార్లలో పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు.కాగా, బాలికపై లైంగిక దాడిని ఒక వ్యక్తి ఐఫోన్‌లో రికార్డ్ చేశాడు. ఈ వీడియోను ఆమెకు షేర్ చేశారు. రూ.40,000 ఇవ్వాలని ఆ బాలికను వారిద్దరూ బ్లాక్‌మెయిల్ చేశారు. లేకపోతే దీనిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించారు.మరోవైపు ఆ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రధాన నిందితుడు ఆసఫ్ అలీ ఖాన్, అతడి అనుచరుడు మేజ్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. థార్ ఎస్‌యూవీతో సహా నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు.అయితే మేజ్ ఖాన్ వీడియో రికార్డ్ చేసిన ఐఫోన్ స్వాధీనం కోసం ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. అతడితో సంబంధాలున్న హెడ్ కానిస్టేబుల్ కీలక సమాచారం లీక్ చేయడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

## రష్యా నుంచి 288 ఎస్-400 క్షిపణుల కొనుగోలు



ఇదేవిధంగా చైనా, పాకిస్థాన్ సరిహద్దుల వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, 400 కిలోమీటర్ల పరిధిలో వైమానిక ముప్పును సమర్థవంతంగా ఎస్-400 వ్యవస్థ అడ్డుకుంటుందని పేర్కొన్నాయి. పాకిస్థాన్‌తో గత ఏడాది తలెత్తిన ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్-400 వ్యవస్థ శత్రువుల వెన్నులో చలిపుట్టించింది. 314 కిలోమీటర్ల దూరంలోని పాక్ యుద్ధ విమానాన్ని కుప్పకూల్చింది. ఆదంపూర్, భుజ్ సెక్టార్లలో ఈ వ్యవస్థను మోహరించడంతో పాక్ గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ యుద్ధ విమానాలను ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ సరిహద్దులకు తరలించాల్సి వచ్చింది. ప్రస్తుతం కొనుగోలు చేయనున్న 400 కి.మీ, 200 కి.మీ, 150 కి.మీ, 40 కిలోమీటర్ల శ్రేణి క్షిపణులు శత్రువుల విమానాలు, డ్రోన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టగలవు.

## ఇండియా పాస్‌పోర్ట్ ర్యాంకింగ్ మెరుగు.

వీసా ఇచ్చే దేశాల సంఖ్య ప్రస్తుతం 56గా ఉంది. గత నెలలో మనకు ఫ్రీ వీసా ఇచ్చే దేశాల సంఖ్య 55 కాగా, ఇప్పుడు 56కు చేరింది. అయితే, గత ఏడాది ఇదే సమయంలో ఈ దేశాల సంఖ్య 57గా ఉండేది. అంటే వీసా ఫీజు చెల్లించకుండా, పెద్దగా డాక్యుమెంటేషన్ అవసరం లేకుండా అప్పట్లో మన పాస్‌పోర్ట్‌తో 57 దేశాలకు వెళ్లగలిగే వీలుండేది. ఇప్పుడు ఇరాన్, బొలీవియా దేశాలు ఫ్రీ వీసా లిస్టు నుంచి ఇండియాను మినహాయించాలి. అయితే, 57 దేశాల జాబితా నుంచి రెండు దేశాలు తప్పుకొంటే 55 దేశాలు ఉండాలి. కానీ, గాంబియా దేశం ఈ జాబితాలోకి తాజాగా చేరింది. ఇండియన్స్‌కు ఫ్రీ వీసా ఇచ్చేందుకు అంగీకరించింది. ఇకపై ఇరాన్, బొలీవియా దేశాలకు వెళ్లాలంటే ముందుగానే వీసా దరఖాస్తు చేసుకోవాలి. వీసా ఉంటేనే దేశంలోకి అనుమతిస్తారు. సాధారణంగా పాస్‌పోర్ట్ ర్యాంకింగ్ పెరిగితే ఉచిత వీసా ఇచ్చే దేశాల సంఖ్య పెరుగుతుంది. కానీ, భారతీయులు ఇరాన్, బొలీవియా వంటి దేశాలు వెళ్లి అక్కడ సరైన ధృవపత్రాలు చూపించకపోవడం, నేరాలకు పాల్పడటం వంటి పనులు చేశారు. దీంతో ఆ దేశాలు ఇప్పుడు ఇండియన్స్ రాక విషయంలో కఠిన నిర్ణయం తీసుకున్నాయి.

## ఆరావళి పర్వతాల్ని తాకనీయం..

దీన్ని వ్యతిరేకిస్తూ 'పీపల్స్ ఫర్ ఆరావళిస్' అనే స్వచ్ఛంద సంస్థ గత ఏడాది దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కోర్టు తాజా నిర్ణయం తీసుకుంది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది. ఆరావళి పరిధిలో, గుర్గావ్-నుహ్ జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో జూ సఫారి ఏర్పాటుపై కోర్టుకు హర్యానా ప్రభుత్వం డీపీఆర్ సమర్పించింది. అంతేకాదు.. గతంలో అనుకున్నట్లుగా 10,000 ఎకరాల్లో కాకుండా 3,300 ఎకరాల్లోనే పార్క్ ఏర్పాటు చేస్తామని కోర్టుకు తెలిపింది. ఇందుకు అనుమతివ్వాలని కోరింది. అయినప్పటికీ, తాము ఇప్పటికి అనుమతులు మాత్రం ఇవ్వబోమని కోర్టు చెప్పింది. ఆరావళిని తాకనివ్వబోమని తేల్చింది.అంతేకాదు.. ఈ అంశంపై ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, శాస్త్రీయ అంశాలతో పూర్తిస్థాయి నివేదిక అందిస్తే అప్పుడు పరిశీలిస్తామని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయంలో తామేమీ నిపుణులం కాదని, అందుకే స్వతంత్ర సంస్థ అందించే సూచనల్ని పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. ప్రస్తుతానికి అంగుళం కూడా ఆరావళి పర్వతాల్ని తాకేందుకు అనుమతివ్వబోమని చెప్పింది. మరోవైపు ఆరావళి పర్వతాల్ని రక్షించాలనే ఉద్యమం దేశవ్యాప్తంగా నడుస్తోంది.

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలపడింది


ఈ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించి బలపడ్డా మన్నారు. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఆరు మున్సి పాల్టీల్లో గెలిచామన్నారు. కరీంనగర్, నిజామా బాద్ కార్పొరేషన్లు కైవసం చేసుకోబోతున్నట్టు వివరించారు. నారాయణపేట, ఆదిలాబాద్, రాయికల్, మెట్‌పల్లిలో తమ పార్టీ అభ్యర్థులే చైర్మెన్ పదవులు పొందుతారని గుర్తు చేశారు. ఎక్స్ అఫిషియో, స్వతంత్రుల మద్దతుతో పలు పదవులను దక్కించుకుంటామన్నారు. కొన్ని జిల్లాల్లో ఫలితాలు ఆశాజనకంగా రాలేదని తెలిపారు. త్రిముఖ పోరులో తమ పార్టీకి కొంత నష్టం జరిగిందన్నారు. తమకు ప్రాతినిధ్యం లేని ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో ఒక డివిజన్, అశ్వారావుపేటలో ఒక వార్డు గెలిచామ న్నారు. కాంగ్రెస్‌కు అనుకున్న ఫలితాలు రాలేద న్నారు. బీఆర్ఎస్ పైనుంచి కిందికి పడిపోయిం దనీ, బీజేపీ కింది నుంచి పైకి లేచిందని వివరిం చారు. ఈ ఎన్నికల్లో 13 శాతం నుంచి 25 శాతానికి ఓట్లు పెరిగాయని తెలిపారు. హంగ్ వచ్చిన చోట బీజేపీ ఎవ్వరికీ మద్దతు ఇవ్వబోదని స్పష్టం చేశారు. కానీ తమకు ఎవరైనా మద్దతు ఇస్తామంటే తీసుకుంటామన్నారు. తమ పార్టీకి ఓట్లు వేసిన ప్రజలకు, కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## కొత్త కార్యాలయంలోకి ప్రధానమంత్రి

ఈ రోజు, నేను 'సేవా తీర్థం', కర్తవ్య భవన్‌ను దేశానికి అంకితమిస్తున్నాను. ఇదే స్ఫూర్తితో 140 కోట్ల మంది దేశ ప్రజల ఆకాంక్షలు, అంచనాలను నెరవేర్చడానికి బలమైన పునాదిగా మారతాయన్నారు. సభకు ముందు సేవా తీర్థ్ కాంప్లెక్స్‌లో శిలాఫలకాన్ని మోడీ ఆవిష్కరించారు. దీనిపై దేవనాగరి లిపిలో 'పౌరుడు దేవునితో సమానం' అని నినాదం రాసి ఉండటం గమనార్హం. ఈ ప్రారంభోత్స కార్యక్రమంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణావ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్, పిఎంఓలో సహాయ మంత్రి జితేంద్ర సింగ్, పాల్గొన్నారు. 2014లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచి పార్లమెంట్‌తో సహా వివిధ ప్రభుత్వ కార్యాయాల భవనాలను, పేర్లను మారుస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్‌ను కొత్త భవనంలోకి మార్చారు. సెంట్రల్ సెక్రటేరియట్ భవనాల పేరును కర్తవ్యభవన్, రాజ్‌పథ్ పేరును కర్తవ్యపథ్‌గా మార్పు చేశారు. ప్రధానమంత్రి అధికారిక నివాసమైన రేస్ కోర్స్ రోడ్డును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చింది.

# మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ హవా

మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ద్వారా తెలంగాణ జాగృతి బోణీ కొట్టింది. అలాగే జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి మద్దతుదారులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచి అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం గమనార్హం. ఏడు కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ నాలుగు స్థానాల్లో హవా కొనసాగించింది. నల్గొండ, రామగుండం, మంచిర్యాల కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మహబూబ్ నగర్ కార్పొరేషన్ కూడా దాదాపుగా హస్తం పార్టీ ఖాతాలో పడే అవకాశం ఉంది. రెండు స్థానాల్లో బీజేపీ.. ఒక స్థానంలో ఇతరులు ఆధిక్యంలో ఉన్నారు. ఇందులో నిజామాబాద్, కరీంనగర్‌లో బిజెపి ఆధిక్యంలో ఉండగా, కొత్తగూడెంకార్పోరేషన్‌లో సిపిఐ ఆధిక్యంలో ఉంది. కార్పొరేషన్లలో బీఆర్ఎస్ ఖాతా తెరవకపోవడం గమనార్హం. ఏడు కార్పొరేషన్ల పరిధిలోని 412 డివిజన్ల నుంచి 2 వేల 225 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రామగుండం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ విజయ పతాకం ఎగరవేసింది. రామగుండం కార్పొరేషన్‌లోని మొత్తం 60 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ 38 డివిజన్లలో విజయం సాధించింది. బీఆర్ఎస్ 13 స్థానాలకే పరిమితం అయింది. మంచిర్యాల కార్పొరేషన్‌ను హస్తం పార్టీ కైవసం చేసుకుంది. మంచిర్యాల కార్పొరేషన్ లో మొత్తం 60 డివిజన్లు ఉండగా.. 39 డివిజన్లలో కాంగ్రెస్ ఆధిక్యం




కనబర్చింది. 8 స్థానాల్లో బీఆర్ఎస్, 4 సీట్లలో బీజేపీ ఆధిక్యంలో ఉంది. కరీంనగర్ కార్పొరేషన్?లో బీజేపీ ఆధిక్యం కనబర్చింది. మొత్తం 66 స్థానాల్లో 29 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ఆధిక్యంలో ఉండగా, 14 కాంగ్రెస్, 11 ఇతరులు, ఎంఐఎం 5, బీఆర్ఎస్ 7 డివిజన్లలో ఆధిక్యంలో ఉండటం గమనార్హం. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కమ్యూనిస్టుల హవా నడిచింది. అయితే హంగ్ మాత్రం తప్పలేదు. కొత్తగూడెంలో 60 డివిజన్లకు గాను సీపీఐకి 22 స్థానాలు, కాంగ్రెస్‌కు 22 స్థానాలు దక్కాయి. మిగతా చోట బీఆర్ఎస్ 8, బీజేపీ, సీపీఎం చెరో స్థానం, స్వతంత్రులు ఆరు చోట్ల గెలిచారు. సీపీఐకి కేటీఆర్ అన్ కండిషనల్ ఆఫర్ ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ వైపు వెళ్లకుండా ఉంటే మద్దతిస్తామని.. మేయర్ సీటును కూడా సీపీఐకే ఆయన ఆఫర్ చేయడం విశేషం. బీఆర్ఎస్ ఆఫర్‌తో ఇప్పుడు బంతి సీపీఐ కోర్టులో ఉంది. నల్గొండ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అదరగొట్టింది. కాంగ్రెస్ 35 స్థానాల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ 10 స్థానాలు, బీజేపీ 02, స్వతంత్రులు ఒక స్థానంలో విజయం సాధించారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో స్పష్టమైన మెజారిటీ దిశగా బీజేపీ ముందుకెళుతోంది. మొత్తం 60 డివిజన్లకు గాను 30కి పైగా స్థానాల్లో బీజేపీ ఆధిక్యం కనబర్చింది. ఇప్పటికే 12 డివిజన్లలలో బీజేపీ గెలిచింది. మహబూబ్ నగర్ కార్పొరేషన్ 30 డివిజన్లకు కౌంటింగ్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ మహబూబ్ నగర్ కార్పొరేషన్‌లో ఆధిక్యం కనబర్చింది. కాంగ్రెస్ పార్టీ 14 డివిజన్లలో గెలిచింది. బీఆర్ఎస్ 8 స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ నాలుగు, ఎంఐఎం ఒక స్థానం కైవసం చేసుకున్నాయి. 31 నుంచి 60 డివిజన్లకు సంబంధించిన కౌంటింగ్ కొనసాగుతుంది.

# అభివృద్ధి, సంక్షేమానికే ప్రజలు పెద్దపీట

ఉన్నారని పేర్కొన్నారు. మొత్తంగా 116 మున్సిపాలిటీలకు గాను 90 నుంచి 94 మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో జమవుతాయని స్పష్టం చేశారు. ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, ఐదు కార్పొరేషన్లలో కాంగ్రెస్ తిరుగులేని మెజారిటీ సాధించిందని తెలిపారు. మరో రెండు చోట్ల హంగ్ ఏర్పడిందన్నారు. రెండు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఇంత పెద్దఎత్తున మున్సిపల్ స్థానాలు రావడం సంతోషం కలిగించే విషయమన్నారు. అభివృద్ధి, సంక్షేమం విశ్వసనీయతకు రాష్ట్ర ప్రజలు పెద్దపీట వేశారనేది ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారనే




విషయం ఈ ఫలితాలతో తేటతెల్లమైందని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు గాలి కబుర్లు చెబుతూ కట్టు కథలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై, కాంగ్రెస్‌పై చేసిన విమర్శలను గమనించి రాష్ట్ర ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పునిచ్చారని చెప్పారు. పట్టణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగిందనీ, అత్యున్నత ప్రమాణాలతో పాలన అందిస్తామని స్పష్టం చేశారు. పార్లమెం టు ఎన్నికల్లో, ఆ తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆ తరువాత పంచాయతీ ఎన్నికల్లో వరుసగా ప్రజా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గమనంలో పెట్టుకోవాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీగా ప్రతిపక్షాలుండాలని సూచించారు. సంపూర్ణ విజయం కోసం శ్రమించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# మెరుగైన ఫలితాలు సాధించాం

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 15 మున్సిపాల్టీలను గెలిచిందని వివరించారు. హంగ్ వచ్చిన వాటిలో 10, 15 మున్సిపాల్టీల్లో తమకు అవకాశముందని చెప్పారు. రాష్ట్రంలో డబ్బు, మద్యం, అధికార యంత్రాంగ దుర్వినియోగం పరాకాష్టకు చేరాయని అన్నారు. అయినా ఓటర్లు భయపడకుండా బీఆర్ఎస్‌కు ఓటు వేశారని చెప్పారు.కాంగ్రెస్ బేరసారాలు, ఎత్తుకుపోవడాలు, పోలీసులను పంపించి బెదిరించడాలు మొదలయ్యాయని అన్నారు. సింగరేణి బొగ్గు కుంభకోణం రూ.ఆరు వేల కోట్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డి కీలక సూత్రధారిగా ఉన్నారని ఆరోపించారు. క్యాతనపల్లి మున్సిపాల్టీలో సీపీఐ తమకు మద్దతిచ్చిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో తాను మాట్లాడాననీ, కొత్తగూడెంలో హంగ్ వచ్చిందనీ, తాము మద్దతిస్తామని హామీ ఇచ్చానని వివరించారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు, అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే ఆ పార్టీతో కలిసి పనిచేస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీని ఎండగడతామనీ, వాటిని నిరోధించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. బీఆర్ఎస్‌కు మంచి భవిష్యత్తు ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని చెప్పారు. కాంగ్రెస్‌ను గద్దెదించే శక్తి, బీజేపీని నిరోధించే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని అన్నారు. హైదరాబాద్ కార్పొరేషన్‌గానీ, మిగతా వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు గానీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు గానీ ఇదే ఉత్సాహంతో ముందుకు పోతామని చెప్పారు. తానే రాజు తానే మంత్రి అనుకున్న వాళ్లను ఎంతో మందిని చూశామని అన్నారు. పిచ్చి తుగ్లక్‌లు చాలా మంది ఉంటారనీ, అలాంటి వారు వస్తుంటారు, పోతుంటారనీ, ఎవరూ శాశ్వతం కాదన్నారు. ఈ దేశం చాలా గొప్పదనీ, ప్రజల చైతన్యాన్ని ఎవరైనా తక్కువ అంచనా వేయొద్దని కోరారు. రేవంత్‌రెడ్డికి పాలన మీద నమ్మకముంటే పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్, బాలరాజు యాదవ్, బొమ్మెర రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

**మార్చి 9 నుంచి రెండో దశ**

మార్చి 9న ప్రారంభ కానున్న రెండో దశ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. శుక్రవారంనాడు ప్రతిపక్షాలు పార్లమెంటు లోపల, వెలుపల ఆందోళన చేపట్టాయి. ఇండియా-అమెరికా వాణిజ్య ఒప్పందంలోని రహస్యాలను తొలగించడం, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవాణే పుస్తకంలోని వివాదాస్పద భాగాలను చర్చించడం, తీవ్ర సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైళ్లలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల పేర్ల ప్రస్తావనకు రావడం వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి.

**నా ప్రసంగంలో ఎక్కువ భాగం రికార్డు నుంచి తొలగించడం సరికాదు : ఖర్గే**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా తన ప్రసంగంలో ఎక్కువ భాగాన్ని రికార్డు నుంచి తొలగించాలనే చర్యను రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకించారు. రాజ్యసభ చైర్మెన్ సి.పి రాధాకృష్ణన్ ఈ చర్యను ఉపసంహరించుకోవాలన్న ఖర్గే డిమాండ్‌ను తిరస్కరించారు.

**ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనలు**

శుక్రవారం లోక్‌సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆందోళనలు చేపట్టారు. సభ్యులు హోరెత్తిన నినాదాలతో వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ ఓంబిర్లాకు బదులుగా సభను నిర్వహించిన సంధ్యారే, ప్రతిపక్షాలను శాంతించాలని పదేపదే కోరారు. కానీ ఫలితం లేకపోయింది. దీని తరువాత, సభ కార్యకలాపాలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, కేంద్రమంత్రులు తమ విభాగాలకు సంబంధించిన పత్రాలను సమర్పించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్టు సంధ్యారే ప్రకటించారు. జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం తర్వాత, రాజ్యసభ కూడా మార్చి 9 వరకు వాయిదా పడింది.

# బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీఎన్పీ ఘనవిజయం

చట్టం ప్రకారం ఆమె శిక్ష ఎదుర్కోవాల్సిందే అని పేర్కొంది. షేక్ హసీనాను అప్పగించాలని విదేశాంగ మంత్రి ఇప్పటికే కోరినట్టు బీఎన్పీ సీనియర్ నాయకుడు సలాహుద్దీన్ అహ్మద్ అన్నారు. దీనికి తాము మద్దతు ఇచ్చినట్టు చెప్పారు. "చట్టం ప్రకారం ఆమెను అప్పగించాలని మేము పదే పదే చెబుతున్నాం.. ఇరు దేశాల విదేశాంగ శాఖల మధ్య దీనిపై సమావేశం జరిగింది.. విచారణను ఎదుర్కోవడానికి షేక్ హసీనాను దయచేసి బంగ్లాదేశ్‌కు పంపాలని భారత్ ప్రభుత్వాన్ని కోరాం" అని ఆయన అన్నారు. ఈ క్రమంలో భారత్ సహా అన్ని పొరుగు దేశాలతో బంగ్లాదేశ్ సాధారణ సంబంధాలు కొనసాగాలని కోరుకుంటుంది, కానీ సమాన నిబంధనలతో మాత్రమే ఉంటుందని అహ్మద్ నొక్కిచెప్పారు. 'భారత్‌తో సహా అన్ని దేశాలతో పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా స్నేహపూర్వక సంబంధం మనకు అవసరం" అని ఆయన అన్నారు. బంగ్లాదేశ్‌లో ఆగస్టు 2024 నాటి విద్యార్థుల ఉద్యమంతో షేక్ హసీనా పదవీచ్యుతురాలైన విషయం తెలిసిందే. దీంతో తన ప్రాణాలను కాపాడుకోవడానికి ఆమె బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు పారిపోయి వచ్చింది. అప్పటి నుంచి ఆమె న్యూఢిల్లీలోని ఓ రహస్య ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్నట్టు సమాచారం. ఆమెపై బంగ్లాదేశ్‌లోని యూనస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పలు కేసులు పెట్టగా.. బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఓ కేసులో మరణ శిక్ష విధించింది. దీంతో ఆమెను అప్పగించాలని భారత్‌ను బంగ్లాదేశ్ డిమాండ్ చేస్తోంది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో హసీనా విషయంలో భారత్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయం ఇరు దేశాల్లో ఆసక్తికరంగా మారింది.

## సంపాదకీయం

# రేవంత్‌ను బలోపేతం చేస్తున్న ఫలితాలు !



తెలంగాణ పట్టణ పోరులో ఊహించినట్లుగానే కాంగ్రెస్ అధిక్యం చాటుకుంది. తాజాగా అందిన ఫలితాలను బట్టి ఆ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమైంది. వరుస ఎన్నికలతో తనకు తిరుగులేదని చాటుకుంది. మొన్నటి పంచాయితీ ఎన్నికలు, నేటి పట్టణ ఎన్నికలు, రెండు ఉప ఎన్నికల్లో గెలుపు ద్వారా సత్తా చాటింది. రేవంత్ నాయకత్వానికి ఇది బలమైన పునాదిగా నిలవనుంది. ఇకపోతే ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న బిఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో ఇంకా సానుకూలత వ్యక్తం కావడం లేదు. ప్రజల్లో వారు చేసిన అవినీతి తాలూకు మరకలు చెరిగి పోవడం లేదు. ప్రజలు ఇంకా వారిని నమ్మేస్థితికి రాలేదనే చెప్పాలి. బావాబామ్మర్దులు పోటాపోటీగా ప్రచారం చేసినా బిఆర్ఎస్ నావను గట్టెక్కించలేక పోయారు. వారు రెండో స్థానంతోనే సరిపెట్టుకోక తప్పడం లేదు. అలాగని కాంగ్రెస్‌కు పోటీ ఇచ్చే స్థాయిలో ఈ రెండో స్థానం లేదు. అందరూ అనుకున్నట్లుగానే కరీంనగర్, నిజామాబాద్ కార్పోరేషన్లలో బిజెపి అధిక్యం ప్రదర్శించింది. ఇది కేవలం కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి ధర్మపురి అర్వింద్‌ల వ్యక్తిగత ప్రతిభ తప్ప మరోటి కాదు. బిజెపి ఊదరగొడుతున్నట్లుగా ప్రజల్లో ఆ పార్టీకి ఇంకా పెద్దగా అవకాశం రాలేదని తెలుసుకోవాలి. చిల్లర ఉపన్యాసాలు మాని తెలంగాణ పునర్నిర్మాణం కోసం ఏమైనా చేయాలన్న సంకల్పం ఆ పార్టీలో రావాలి. కేంద్రాన్ని ఒప్పించి ఓ నాలుగు అభివృద్ధి పనులను చేపడితే తప్ప బిజెపికి మనుగడ ఉండదు. ఇకపోతే అనూహ్య ఘటన ఒకటి చోటు చేసుకుంది. కుటుంబ పార్టీతో తెగదెంపులు చేసుకుని కొత్త పార్టీవైపు అడుగులు వేస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అనూహ్యంగా దూసుకు వచ్చారు. ఓ అడుగు పడేలా చేశారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తుతో పోటీకి దిగుతున్నట్లు ప్రకటించి రంగంలోకి దూకారు. ఆమె ప్రయత్నం ఫలించింది. గద్వాల జిల్లా వడ్డేపల్లిలో ఏకంగా పాగా వేశారు. ఇది ఆమె రాజకీయ పార్టీ ప్రయత్నాలకు పెద్ద విజయంగానే చూడాలి. ఇక రాజకీయాల విషయానికి వస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని నిరూపితం అవుతోంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మనుగడ సాగించడమే కాదు పటిష్టం అవుతోంది. పంచాయితీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ ఇప్పుడు నగర, పట్టణ ఓటర్లలోనూ తన పట్టు నిలుపుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ విజయ పరంపర లోక్‌సభ ఎన్నికలు, రెండు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికల్లో విజయాల వరకు సాగింది. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లోనూ అదేజోరు కొనసాగించింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు బుధవారం జరిగిన పోలింగ్ తరవాత శుక్రవారం చేపట్టిన కౌంటింగ్‌లో కాంగ్రెస్ ఆధిక్యం కొనసాగింపు స్పష్టంగా కనిపించింది. కరీంనగర్, నల్లగొండ, నిజాబాద్, పాలమూరు, ఉమ్మడి వరంగల్, మెదక్ జల్లాల్లోనూ దాదాపు ఎక్కువ పట్టణాల్లో విజయం కైవసం చేసుకుంది. కాంగ్రెస్ తరపున అన్నీ తానై ఎన్నికల పక్రియకు నేతృత్వం వహించిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో మరింత బలపడే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీయే ఆధిక్యతను కొనసాగించడం ద్వారా రేపటి మండల, జడ్పీల్లోనూ పట్టును కొనసాగిస్తుందన్న భరోసా ఏర్పడింది. నగరాలు, పట్టణాల్లోని ఓటరు ఆలోచన భిన్నంగా ఉంటుందనే విషయం గుర్తించిన సిఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అభివృద్ధిని తెరపైకి తెచ్చారు. మోడీకి గల్లీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాపాలను ఎండగట్టారు. ఇవన్నీ కూడా ఇంకా ప్రజల మదిలో చెదిరిపోలేదని తెలుసుకునే ఆయన ఈ తరహా ప్రచారంలో దూసుకు పోవడం కలిసివచ్చింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం అన్నది ప్రజలు కూడా గుర్తించారు. ఎందుకంటే అధికార పార్టీ అండవుంటే తప్ప అభివృద్ధి సాధ్యం కాదు. అందుకే ప్రజలు కూడా అధికార కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారని అనుకోవాలి. నగర, పట్టణ ప్రాంతాల్లో పౌర సమస్యల్ని ప్రధానంగా చర్చకు తెచ్చి వారిని లోచించేలా కాంగ్రెస్ నేతలు పనిచేశారు. ప్రధాన ప్రతిపక్షంగా బిఆర్ఎస్ పదేళ్ల పాటు తెలంగాణను ఏలింది. ఈ పదేళ్లలో అప్పుల చేసిందే తప్ప అభివృద్ధి చేయలేదు. ఆస్తులు పెంచుకుందే తప్ప ప్రజలను ఆదుకోలేదు. లక్షల కోట్లు ఆస్తులు కూడబెట్టారని గ్రామస్థాయి వరకు ప్రజల్లో ఇంకా చర్చ సాగుతోంది. కాలికి చెప్పుల్లేని బిఆర్ఎస్ నేతలు బెంజ్ కారుల్లో తిరుగుతుంటే ప్రజలకు మండడం ఖాయం. అందుకే అసెంబ్లీ ఎన్నికలు మొదలు అన్ని ఎన్నికల్లోనూ వాతలు పెడుతూ వచ్చారు. పెద్దాయన ఇల్లు కదలలేని స్థితలో ఉన్నారు. అది కూడా పార్టీకి మైనస్‌గా మారింది. మున్సిపల్ ఎన్నికల్లో బిజీ ఉన్నానంటూ టెలిఫోన్ టాపింగ్' విచారణకు వ్యవధి కోరిన పార్టీ అధినేత కేసీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంపై దృష్టిపెట్టలేక పోయారు. అయితే అందుకు భిన్నంగా రేవంత్ రెడ్డి నిరంతరం ఎన్నికల్లో గెలుపుపైనే దృష్టి సారించారు. అమెరికాలో ఉన్నా, దిశా నిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి అన్నీ తానై ఎన్నికల బరువు బాధ్యత తీసుకున్నారు. స్వయంగా పలు జిల్లాలు పర్యటిస్తూ ఎన్నికల ప్రత్యక్ష-పరోక్ష ప్రచారంలో పాల్గొన్నారు. వనరుల్ని సమకూర్చారు. గెలుపు మంత్రం జపిస్తూ మంత్రుల్ని పురమా యించారు. మంత్రులకు లోక్‌సభ నియోజకవర్గాల వారిగా బాధ్యతలు అప్పగించి బాధ్యతలు అప్పగించారు. మంత్రులు తమకు అప్పగించిన బాధ్యతల్లో తలమునకలై ఉండేలా నిరంతరం పర్యవేక్షించారు. అటు బిజెపిని, ఇటు బిఆర్ఎస్‌ను ఏక కాలంలో విమర్శలు చేస్తూ ప్రజల్లో చర్చ సాగేలా చేయడంలో రేవంత్ విజయం సాధించారు. అదే ఇప్పుడు పుర ఎన్నికల్లో విజయానికి బాటలు వేసింది. అయితే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అక్కడక్కడా కొన్నచోట్ల విజయం సాధించినా, గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. అందుకేనేమో ఆ పార్టీ ఎన్నికల తెల్లారే కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని పిల్లి శాపనార్థాలు చేసింది.

# నా గెలుపు 5వ వార్డ్ ప్రజలకు అంకితం.

**-5వ వార్డ్ కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు.**



**మెదక్ జిల్లా-13ఫిబ్రవరి (మహాప్రభ)**

ప్రజా సేవలో ప్రజల కోసం పరితపించే నాయకులు చాలా అరుదు ఎన్నికల్లో గెలుపు పదువులు రాగానే గర్వాంగా ఫీల్ అయ్యే నాయకులు ఓటు వేసిన ప్రజల ను పట్టించుకునే నాయకులు ఈ రోజుల్లో వున్నారని. మెదక్ పట్టణ ములోని మున్సిపల్ ఎన్నికల్లో రెండు సార్లు 5వ వార్డు నుండీ ప్రజల విశ్వాసంతో గెలిపించారు. వార్డు ప్రజలు సమస్యలు వచ్చిన ఫోన్ చేసిన వెంటనే పరిష్కారం చేసే నాయకులు మామిండ్ల ఆంజనేయులని పండుగలకు పర్వదినాలకు వినాయక చవితి. బతుకమ్మ దసరా సంక్రాంతి పండుగలను ప్రజల మధ్యలోనే జరుపుకుంటారు. వార్డు ప్రజలు ఒక సోదరుడుగా భావిస్తూ ఎంతో ఆప్యాయంగా అంజన్న పిలిచే నాయకుడు ప్రజా నాయకుడిగా ప్రజా బంధువుగా ఈ ఎన్నికల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా 5వ వార్డ్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మీ ప్రేమ అనురాగాలు ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే నా గెలుపు సాధ్యమైందని ఈ విజయం మా వార్డు ప్రజలని వారికి పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

# కౌంటింగ్ సందర్భంగా వేస్లీ కళాశాలలో పోలీస్ బందోబస్తు పరిశీలన

**అదనపు ఎస్పీ మహేందర్.**



**మెదక్ జిల్లా-13ఫిబ్రవరి (మహాప్రభ)**

కౌంటింగ్ నేపథ్యంలో మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని వేస్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తును మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ప్రవేశ ద్వారాల వద్ద నిర్వహిస్తున్న తనిఖీలను సమీక్షించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిని కఠినంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఎవరూ కూడా మొబైల్ ఫోన్లు లేదా ఇతర పరికరాలు తీసుకెళ్లకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లను కూడా పూర్తిగా తనిఖీ చేసి ఎలాంటి నిషేధిత వస్తువులు తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు తెలిపారు. అలాగే కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో వాహనాల పార్కింగ్‌ను క్రమపద్ధతిలో ఏర్పాటు చేసి, అనుమతి లేని వాహనాలను అనుమతించవద్దని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత కల్పించి, అనుమతి లేని వ్యక్తులు చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రతి పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని అదనపు ఎస్పీ గారు స్పష్టం చేశారు.

# ఏఐసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి మీద అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**-ఎస్సై బ్రహ్మనాయుడుకు ఫిర్యాదు**
**-తిరుపతి జిల్లా కాంగ్రెస్6 పార్టీ అధ్యక్షులు బాలగురవం బాబు**




**ఫిబ్రవరి 13 (సూళ్లూరుపేట) మహాప్రభ.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏఐసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి మీద ఎన్నారై పంచ్ ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల గురవం బాబు తెలియజేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన పంచ ప్రభాకర్ పై కేసు నమోదు చేయాలని సూళ్లూరుపేట ఎస్సై బ్రహ్మనాయుడుకు ఫిర్యాదు చేశారు. బాల గురవం బాబు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు, మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రభాకర్ కి తల్లి, చెల్లి ఉన్నప్పటికీ సాటి మహిళపై ఇటువంటి వాక్యాలను చేయడం సరైన పద్ధతి కాదని, సోషల్ మాధ్యమాలలో ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసే వాళ్ళపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర దేశాలలో ఉండి మాట్లాడడం కాదని, నీకు దైర్యం ఉంటే భారతదేశానికి వచ్చి మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తల అందరూ తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఫిర్యాదులో పంచ్ ప్రభాకర్ సోషల్ మీడియా ఖాతాలను రద్దు చేయాలని తెలిపారు. ఈయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్ రెడ్డి, జిల్లా కార్మిక కర్షక కాంగ్రెస్ చైర్మన్ బాల గురవం చిరంజీవి, జిల్లా మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ షేక్ రాజిక్ పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయం



**ఆమనగల్లు, -13ఫిబ్రవరి (మహాప్రభ)**

ఆమనగల్ పట్టణంలోని అయ్యప్ప కొండ దగ్గరలో ఉన్న శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం నాడు శివ స్వాములు పూజా కార్యక్రమాలు ఘనంగానిర్వహించి, శివ స్వాములు స్వామి వార్ల పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ పూజారి మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయ ట్రస్టు చైర్మన్ రేగట్టి శ్రీనివాసులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భక్తులకు అన్ని ఏర్పాట్లను చేశారని శ్రీనివాసులు తెలిపారు. పడిపూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజ అనంతరం శివస్వాములకు, భక్తులకు అన్న ప్రసాద వితరణ దేవాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, మహిళా భక్తులు, పుర ప్రముఖులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో బీజేపీ విజయోత్సవ ర్యాలీ

**పాల్గొన్న రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**



**మిడ్జిల్, -13ఫిబ్రవరి (మహాప్రభ)**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో కల్వకుర్తి మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ ఐదు వార్డులను కైవసం చేసుకోవడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ విజయోత్సవ ర్యాలీలో బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొని పార్టీ కార్యకర్తలను అభినందించారు. ప్రజలు బీజేపీపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలకు జనార్దన్ రెడ్డి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి మున్సిపాలిటీలో బీజేపీ మరింత బలోపేతం కావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేశారు.

# ముగిసిన మునిసిపల్ ఎన్నికల ఫలితాలు..

## మెదక్ మున్సిపాలిటీ లో గెలిచిన అభ్యర్థుల జాబితా

**మెదక్ జిల్లా–13ఫిబ్రవరి (మహాప్రభ)**
మెదక్ మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలు రసవత్తరంగా సాగాయి. ఈనెల 11న మున్సిపల్ ఎన్నికలు జరగగా శుక్రవారం మెదక్ మున్సిపాలిటీకి సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ సీఎస్ఐ కాలేజీలో జరిగాయి. మెదక్ మున్సిపాలిటీలో మొత్తం 112 కౌన్సిలర్ అభ్యర్థులు బరిలో నిలిచారు. 32 వ వార్డు గోదల మానస ఏకగ్రీవంగా అయ్యారు. 113 మంది కౌన్సిలర్ ఉన్నారు.

**1, వ వార్డ్ :** ఔరంగాబాద్ ఏరియా వార్డ్
రిజర్వేషన్ : ఎస్సీ మహిళా
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : చెప్పాలా రాజవ్వ సంజీవ్,
**2, వ వార్డ్ :** ఆవుసుల పల్లి ఏరియా వార్డ్
రిజర్వేషన్ : ఎస్టీ జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : ఎరుకల నరసింహులు. 3, వ వార్డ్ : ఆవుసుల పల్లి ఏరియా వార్డ్
రిజర్వేషన్ : జెనరల్ మహిళా
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : కొట్టాల లలితమ్మ, విశ్వం.
**4, వ వార్డ్ :** హౌసింగ్ బోర్డ్ కాలనీ మరియు ఆర్టీసీ కాలనీ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : జెనరల్ మహిళా
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : ధర్మ శెట్టి స్వరూప.
**5, వ వార్డ్ :** ఇందిరా కాలనీ మరియు మిలిటరీ కాలనీ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : జెనరల్
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : మామిడ్ల ఆంజనేయులు. 6, వ వార్డ్ : జమ్మికుంట కాలనీ మరియు ఇంద్ర కాలనీ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : కొడకంటి హరిత,నర్సింగరావు.
7, వ వార్డ్ : రాంనగర్ కాలనీ మరియు కోవతిస్లం ఏరియాలు, వార్డ్
రిజర్వేషన్ : బీసీ మహిళా
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : శంసున్నీసా ,అంజత్ భాయ్.
8, వ వార్డ్ : రాంనగర్ కాలనీ ఏరియా వార్డ్
రిజర్వేషన్ : బీసీ మహిళా
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : :మాయాగంగామణి, మల్లేశం. 9, వ వార్డ్ : వాసవి నగర్ కాలనీ మరియు ఆజంపుర కాలనీ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : జెనరల్
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి: ఎం డి, జుబేర్ అహ్మద్ ,10, వ వార్డ్ : నర్స్ కేడు ఏరియా వార్డ్
రిజర్వేషన్ : జెనరల్ మహిళ
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : చింతల లక్ష్మీ స్వరాగిని, 11, వ వార్డ్ : సాయి నగర్ కాలనీ మరియు వెంకట్రావు నగర్ కాలనీ మరియు బాబా కాలనీ మరియు రషీద్ కాలనీ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : బీసీ మహిళ
విజేత



కాంగ్రెస్ అభ్యర్థి : నస్రిన్,
12, వ వార్డ్ : రషీద్ కాలనీ మరియు పిల్లి కోటలు కాలనీ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : బీసీ మహిళ
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : అనిసా ఫాతిమా, ఇందాద్ ఆలీ.
13, వ వార్డ్ : వడ్డెర కాలనీ మరియు చంద్రపాల్ వెంచర్ మరియు మార్కెట్ యార్డ్ కాలనీ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : ఎస్సీ మహిళా
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : చెదల సంధ్యారాణి , నవీన్
14, వ వార్డ్ : నవపేట్ ఏరియా వార్డ్
రిజర్వేషన్ : జెనరల్ మహిళా
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : దొంతి లక్ష్మి, ముత్యం గౌడ్,15, వ వార్డ్ నవబు పేట్, గోడ్డల గడ్డ మరియు కట్టకింద కాలని మరియు పిట్లంబేస్ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : బీసీ జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : దొంతి నరేష్ గౌడ్. 16, వ వార్డ్ : దాయర కాలనీ, చమన్ , సంజీవయ్య కాలనీ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : బీసీ జెనరల్
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : అవారి రాజశేఖర్. 17, వార్డ్: సుభాష్ కాలనీ మరియు రిక్షా కాలనీ మరియు దాయర కాలనీ ఏరియాలు
రిజర్వేషన్ : జెనరల్ మహిళా
విజేత
బీ ఎస్పీ అభ్యర్థి : బుజ్జరంపేట అరుణ,అఖిల్ అమ్మ. 18,వ వార్డ్ : గాంధీనగర్ కాలనీ వార్డ్
రిజర్వేషన్ : ఎస్సీ జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : పాత శశాంక్ తేజ్.రితీష్,19, వ వార్డ్ : ఫతే నగర్ మరియు చమన్ మరియు మిషన్ కాంపౌండ్ కాలనీ మరియు గాంధీనగర్ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : గంట సంపత్. 20, వ వార్డ్ : పతెనగర్ మరియు మల గడ్డ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : బీసీ జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : మహమ్మద్ మన్సూర్ హైమద్. 21, వ వార్డ్ : పతెనగర్ మరియు చమన్ మరియు పిట్లంబేస్ వార్డ్
రిజర్వేషన్ : బీసీ మహిళ
విజేత
బిజెపి అభ్యర్థి : పబ్బ రాజమణి, లక్ష్మణ్.
22, వ వార్డ్ : పతెనగర్ మరియు చింత బొంద మరియు చమన్ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : జెనరల్
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : మహమ్మద్ గౌస్ ఖురేషి.
23, వ వార్డ్ : చమన్ మరియు పిట్లంబేస్ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : జెనరల్ మహిళ
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : మద్దిబోయిన శృతి, సంతోష్ ( పూసల )
24, వ వార్డ్ : బ్రాహ్మణ విధి మరియు చమన్ మరియు జెన్ రోడ్డు ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : బీసీ జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : కానుగు రాధిక, భూపతి రాజ్.
25, వ వార్డ్ : పిల్లిడి మరియు బ్రాహ్మణ వీధి ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ బీసీ జెనరల్
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : కాజా సోయల్ మొహమ్మద్దీన్
26, వ వార్డ్ : ఆజంపుర మరియు శాంతినగర్ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : ఎస్సీ జెనరల్
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : మ్యాదరి దీపక్ కుమార్.
27, వ వార్డ్: గోల్కొండ ఏరియా వార్డ్
రిజర్వేషన్ : జెనరల్ మహిళా
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : అస్తరి గల్లపల్లె రాణి, బాల రాజ్.,28, వ వార్డ్ : కోలీగడ్డ ఏరియా వార్డ్
రిజర్వేషన్ : జెనరల్ మహిళా
విజేత
బిజెపి అభ్యర్థి : బోడికే అఖిల, భరత్ పల్స్ హాస్పిటల్,29, వ వార్డ్ : అరబ్ గల్లి మరియు మార్కెట్ మరియు కుమ్మరిగడ్డ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : బీసీ జెనరల్
విజేత
బిఆర్ఎస్ అభ్యర్థి : బట్టి ఉదయ్ కుమార్,30, వ వార్డ్: పెద్ద బజార్ మరియు కుమ్మరి గడ్డ మరియు పుచ్చగడ్డ నవాపేట్ ఏరియాలు వార్డ్
రిజర్వేషన్ : జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : అరుణాతి వెంకటరమణ,31, వ వార్డ్ : పిట్లంబేస్ మరియు పెద్దబజార్ భరహీమము మరియు మార్కెట్ ఏరియాలు
రిజర్వేషన్ : జెనరల్
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : తొడుపునూరి శివ రామ కృష్ణ, తండ్రి చంద్రపాల్. 32, వ వార్డ్ : పిట్లంబేస్ ఏరియా వార్డ్
రిజర్వేషన్ : జెనరల్ మహిళ
విజేత
కాంగ్రెస్ అభ్యర్థి : గోదల మానస, సాయిరాం ఏకగ్రీవం గోదాల మానస ను ఎన్నుకున్నారు. ఈ పోటీలో
కాంగ్రెస్ పార్టీకి 14
బి ఆర్ ఎస్ పార్టీకి 15,
బిజెపి పార్టీకి 2,
ఏఐఎంఐఎం పార్టీకి 0
బి ఎస్పీ పార్టీకి ఒకరు గెలుపొందారు. చైర్మన్ పదవి కోసం ఏ పార్టీకి మెజార్టీ రాలేదు 16వ తేదీ చైర్మన్ ఎవరు అవుతారో ప్రశ్నార్థకం గా మారింది.

## కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



**మేడ్చల్ ఫిబ్రవరి 13 (మహాప్రభ)**
మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం కిసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోస్తావల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గణపతి పూజ కార్యక్రమాలలో పాల్గోని ఆలయం లో స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు

## ఏడుపాయల జాతర పెండింగ్ పనులు పూర్తి చేయాలి

-భక్తులకు అసౌకర్యకం కలుగకుండా చర్యకు చేపట్టాలి.
-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.



**మెదక్ జిల్లా--13ఫిబ్రవరి (మహాప్రభ)**
భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, ఏడుపాయల జాతర పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏడుపాయల జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్య కలవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్, త్రాగునీరు, పార్కింగ్, సంస్కృతిక కార్యక్రమాలు, దర్శన ఏర్పాట్లు , ఇతర పెండింగ్లో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సంవత్సరం జాతరకు దాదాపు పది లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి జాతరను ప్రశాంతంగా ముగించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీరేశం, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలి.



**కాజీపేట–13ఫిబ్రవరి (మహాప్రభ)**
కాజీపేట మండలం మడికొండ ఎస్సీ కాలనీ అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో, డాన్ బోస్కో నవజీవన్ ఆధ్వర్యంలో, మడికొండ ఈవినింగ్ ట్యూషన్ సెంటర్ లో ఆహారం యొక్క పోషక పదార్థాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ అరుణ్ జ్యోతి, పాల్గొన్నారు. పోషక పదార్థాల గురించి వివరించారు. డాన్ బోస్కో నవజీవన్ స్టాప్ డాక్టర్ అవినాష్,రాజు,హేమలత కుమారస్వామి,కళ్యాణ్ ఉల్లాస, కేజియా, బీఎస్పీ వరంగల్ జిల్లా ఇన్చార్జ్ వస్కుల ప్రవీణ్ కుమార్ జేరిపోతుల జయరాజ్ మహిళలు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీకగా ముస్లిం యువత సేవా కార్యక్రమం



**అమ్రాబాద్,**
**–13ఫిబ్రవరి (మహాప్రభ)**
మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం దర్శనార్థం కాలినడకన ప్రయాణిస్తున్న శివ స్వాములకు ముస్లిం మైనార్టీ యువత సేవా కార్యక్రమం నిర్వహించారు. హజ్రత్ నిరంజన్ షావలి గందోత్సవం కమిటీ ఆధ్వర్యంలో యాత్రికులకు పండ్లు, తాగునీటి బాటిళ్లు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా భక్తులకు అవసరమైన సౌకర్యాలు అందిస్తూ పరస్పర స్నేహభావాన్ని చాటారు. సమాజంలో ఐక్యత, ప్రేమ, మానవతా విలువలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ సేవ కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ అలీ, కార్యదర్శి ఎండీ ఇలియాజ్, ఎండీ జునైద్, ఎండీ అస్గర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్ 15వ వార్డులో బీఆర్ఎస్ విజయం..



**ఆమనగల్, – 13ఫిబ్రవరి (మహాప్రభ)**
ఆమనగల్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో 15వ వార్డులో టిఆర్ఎస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. ఈ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థిని ఎంగలి భాగ్యలక్ష్మి 27 ఓట్లతో సమీప బీజేపీ అభ్యర్థి పై ఘన విజయం సాధించారు. లెక్కింపు ప్రారంభం నుంచే ఆదిత్యం కనపరచగా తుది ఫలితాల్లో టిఆర్ఎస్ ముందంజలో నిలిచింది. దీంతో బిఆర్ఎస్ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. ఈ గెలుపుతో వార్డులో గులాబీ శ్రేణుల కోలాహలం మిన్నంటింది.

## ఆమనగల్ 5వ వార్డులో పాపిశెట్టి రామకృష్ణ గెలుపు



**ఆమనగల్,**
**–13ఫిబ్రవరి (మహాప్రభ)**
ఆమనగల్ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఫలితాల్లో బిఆర్ఎస్ బోని కొట్టింది. 5వ వార్డు నుంచి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన పాపిశెట్టి రామకృష్ణ విజయం సాధించారు. సమీప కాంగ్రెస్ అభ్యర్థి పై 312 ఓట్ల మెజారిటీతో గెలిచారు. పాపిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీని, పార్టీ సిద్ధాంతాలు , నేను చేసిన సామాజిక సేవను, మరియు తనను నమ్మి నాకు ఓటు వేసి, మిగతా బిఆర్ఎస్ ఎనిమిది మంది అభ్యర్థులను గెలిపించినందుకు ఆయన ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. వార్డు అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పాపి శెట్టి రామకృష్ణ విజయం సాధించడంతో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు బాణాసంచా కాలుస్తూ సంబరాల్లో మునిగిపోయారు.

## కురవి ఉన్నత పాఠశాలలో ఘనంగా ఇంగ్లీష్ భాషా దినోత్సవం




**కురవి, -13ఫిబ్రవరి (మహాప్రభ)**
భారత కోకిల సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంపటి విజయ్ రాజ్, ఉపాధ్యాయులతో కలిసి సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థుల కోసం క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థుల నృత్యం, 7వ తరగతి విద్యార్థుల "జంక్ ఫుడ్ తినవద్దు -- ఇంటి హెల్తీ ఫుడ్ తినాలి" అనే స్కిట్ అందరినీ ఆకట్టుకుంది. ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు శ్యామల దేవి మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి ఇంగ్లీష్ భాషను బాగా నేర్చుకుంటే ప్రపంచ జ్ఞానాన్ని సులభంగా పొందవచ్చు" అని సూచించారు. కార్యక్రమంలో గుండోజు నరసింహ చారి, బొంగాని మల్లికార్జున్, బండి రవీందర్, విజయలక్ష్మి, పద్మలత, రత్నమాల, యాకమ్మ, భూక్య బాలాజీ, దైద వెంకటేశ్వర్లు, ఉదయమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు 11వ వార్డు బిజెపి అభ్యర్థి సునీత విజయం



**ఆమనగల్లు, -13ఫిబ్రవరి (మహాప్రభ)**
ఆమనగల్లు మున్సిపాలిటీ 11వ వార్డులో బిజెపి అభ్యర్థి సునీత 30 ఓట్లతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన వాడు ప్రజలకు, సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపుతో బిజెపి శ్రేణులు మిఠాయిలు పంచుకుంటూ సంబరాల్లో మునిగిపోయారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ





**దేవరకొండ -13ఫిబ్రవరి (మహాప్రభ)**
డిండి మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డిండి ప్రాజెక్ట్ లో శుక్రవారం రోజున స్వపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులందరు ప్రత్యేక ఆకర్షణలో ముస్తాబై వచ్చి తమకు ఇచ్చిన విషయాంశలు బోధించి తమ ప్రతిభను చాటుకున్నారు .పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా సోనాలి, గవర్నర్ గా ఇందు, ముఖ్యమంత్రిగా నిఖిత, విద్యా శాఖ మంత్రిగా సౌమ్య, యం.ఎల్.ఏ గా బన్ని, ఆర్.జె.డి గా భార్గవి, కలెక్టర్ గా గౌతమి, డి.ఇ.ఓ గా సింధు, యం.ఇ.ఓ గా నాగరాణి, యం.ఆర్.ఓ గా సామెల్, యం.పి.డి.ఓ గా స్పందన, సర్పంచ్ గా ప్రీతి విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గీతాంజలి,ఏఏపిసి చైర్మన్ ఎల్లమ్మ, ఉపాధ్యాయులు తిరుపతయ్య, ధనమ్మ,సరోజ,అనిత, సత్యనారాయణ,యాదయ్య, సుజాత,జ్యోతి,రాంబాబు,నవనీత థెరెసా,సుజల,పావని,హర్ష,ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ హస్తగతం

**నల్లగొండ -13ఫిబ్రవరి (మహాప్రభ)**
నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48 డివిజన్లో గాను
27 చోట్ల కాంగ్రెస్ ఘన విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ 09 స్థానాలకే పరిమితం కాగా, , బీజేపీ 4 డివిజన్లలో, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 4 డివిజన్లలో ఎంఐఎం 2 డివిజన్లలో ఇతరులు రెండు డివిజన్ల లో గెలుపొందాయి. ఈ భారీ విజయంతో కాంగ్రెస్ శ్రేణుల బాణసంచా పేలుళ్లు, మిఠాయిల పంపిణీతో జిల్లా కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

**డివిజన్లో వారిగా వివరాలు**
1వ డివిజన్ ఆలకుంట్ల నాగరాజు కాంగ్రెస్, 2వ డివిజన్ పి యాదయ్య బిఆర్ఎస్, 3వ డివిజన్ పేర్ల మల్లేశ్వరి బీఆర్ఎస్, 4వ డివిజన్ రత్నగిరి తారకమ్మ బీఆర్ఎస్, 5వ డివిజన్ పున్న జ్ఞానేశ్వరి కాంగ్రెస్, 6వ డివిజన్ కుందూరు దీపిక బీఆర్ఎస్, 7వ డివిజన్ మారగోని భవాని బి ఆర్ ఎస్, 8వ డివిజన్ సంతోషిణీ కాంగ్రెస్, 9వ డివిజన్ భగవత్ దీప్లా నాయక్ బీఆర్ఎస్, పదవ డివిజన్, 10వ డివిజన్ పిల్లి కృష్ణంరాజు ఏఐఎఫ్బి



,11వ డివిజన్ పాలకూరి సుమలత ఏఐఎఫ్బి,, 12వ డివిజన్ మామిడి క్రాంతి కుమార్ కాంగ్రెస్, 13వ డివిజన్ గుమ్మల జానకి కాంగ్రెస్, 14వ డివిజన్ బొజ్జ శంకరయ్య కాంగ్రెస్, 15వ డివిజన్ డి రమేష్ బి ఆర్ ఎస్, 16వ డివిజన్ పెరిక స్వాతి కాంగ్రెస్, 17వ డివిజన్ మందడి లిఖిత బిఆర్ఎస్, 18వ డివిజన్ ఆలకుంట్ల ఝాన్సీ రాణి ఏఐఎఫ్బి, 19వ డివిజన్ గోగుల గణేష్ కాంగ్రెస్, 20 డివిజన్ అల్లి సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్,21 డివిజన్ మహమ్మద్ ఇబ్రహీం కాంగ్రెస్, 22వ డివిజన్ అమీనా ఫర్వీన్ కాంగ్రెస్, 23వ డివిజన్ మహమ్మద్ మహబూబ్ అలీ కాంగ్రెస్, 24వ డివిజన్ గోపగాని స్వాతి బిఆర్ఎస్, 25వ డివిజన్ వంగూరి నవ్యశ్రీ బిజెపి, 26వ డివిజన్ గౌస్యాబేగం ఇతరులు, 27వ డివిజన్ ఎస్ రేవతి బిజెపి, 28వ డివిజన్ జి పుష్పలత కాంగ్రెస్, 29వ డివిజన్ ఖాజా నదీమ్ ఎంఐఎం, 30 డివిజన్ మారగాని నవీన్ కుమార్ కాంగ్రెస్, 31 డివిజన్ కౌసర్ కాంగ్రెస్, 32వ డివిజన్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్, 33వ డివిజన్ రేగట్టే అండాలు కాంగ్రెస్, 34వ డివిజన్ శ్రీధర్ రెడ్డి కాంగ్రెస్, 35వ డివిజన్ ఇటికల మంగమ్మ కాంగ్రెస్, 36వ డివిజన్ గంట్ల అనంతరెడ్డి ఇతరులు, 37వ డివిజన్ రామగిరి అఖిల్ బిజెపి, 38 వ డివిజన్ బోయినపల్లి వేదశ్రీ కాంగ్రెస్, 39 వ డివిజన్ దాసరి సాయికుమార్ బిజెపి, 40 డివిజన్ బొడ్డుపల్లి లక్ష్మీ కాంగ్రెస్, 41వ డివిజన్ కేసాని వేణుగోపాల్ రెడ్డి కాంగ్రెస్, 42వ డివిజన్ అల్లి నాగలక్ష్మి ఏఐఎఫ్బి, 43వ డివిజన్ ఎండి ఖలీల్ కాంగ్రెస్, 44వ డివిజన్ మహమ్మద్ ఇర్ఫాన్ అహ్మద్ కాంగ్రెస్, 45వ డివిజన్ మహమ్మద్ అష్రఫ్ అలీ, 46 డివిజన్ మొహమ్మద్ రఫీ ఉద్దీన్ ఎంఐఎం, 47వ డివిజన్ అబ్బ గోలి కవిత కాంగ్రెస్, 48వ డివిజన్ ఈయామ కవితా రాణి కాంగ్రెస్.

# యూరియా బ్లాకు దందాను అరికట్టి

**- పంట పొలాలను కాపాడాలి**
**-యూరియా యాప్ ను రద్దు చేయాలి -బిసిపిఎం**

**నిడమానూరు -13ఫిబ్రవరి (మహాప్రభ)**
రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన యూరియా యాప్ ను రద్దు చేయాలని, బ్లాక్ దందా ను అరికట్టి పంట పొలాలను కాపాడాలని నిడమనూరు మండల కేంద్రంలో శుక్రవారం అగ్రికల్చర్ ఏవో ఆఫీస్ ముందు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరు కోటేష్ లు
మాట్లాడుతూ యూరియా స్లాట్ బుకింగ్ తో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వెంటనే ఆ యాప్ ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఆన్లైన్ బుక్ చేసుకుంటేనే యూరియా ఇస్తామనడంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సొసైటీ అధికారులు ఎరువుల డీలర్లు యూరియాను ఆన్లైన్లో ఇలా పెట్టగానే సెకండ్ల వ్యవధిలో స్టాక్ అయి పోతుందని రైతులు ఒక బస్తా యూరియా కోసం అప్పులు చేసి



సెల్ ఫోన్లు కొని, సెల్ ఫోన్లు పట్టాదారు పాస్ పుస్తకాలు పట్టుకొని సొసైటీల ముందు, ఫర్టిలైజర్ షాప్ ల ముందు నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు, నిరక్షరాస్యులు, వృద్ధులు, వికలాంగులు, స్మార్ట్ ఫోన్లు లేని రైతులు యూరియా యాప్ డౌన్లోడ్ చేసుకోవడంలో యూరియా బుక్ చేసుకునే విధానంలో, రెండుసార్లు ఓటిపి ఎంటర్ చేయడంలో, సర్వర్ డౌన్ అని, సిగ్నల్ లేదని, నో స్టాక్ అని చూపించడంలో ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. ఒక బస్తా యూరియా కోసం 40,50 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని, భూమి ఉండి పాస్ పుస్తకాలను లేని రైతులు, కౌలు రైతు లు కూడా ఇబ్బంది పడుతున్నారని వారన్నారు. అధికారులు ప్రతిరోజు యూరియా వస్తుందని లెక్కలు చెబుతున్నారు కానీ బుక్ చేసుకుంటే నో స్టాక్ అని యాప్ లో చూపిస్తుందని వచ్చిన యూరియాని ఎటు పోతుందో అర్థం కాని పరిస్థితిలో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఫర్టిలైజర్ యజమానులు, సంబంధిత అధికారులు, దళారులు పెద్ద ఎత్తున యూరియా బ్లాక్ దందా నిర్వహిస్తున్న సంబంధిత పై స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, యూరియా అంధక పంట పొలాలకు తెగుళ్లు వచ్చి ఎర్రబారుతున్నాయని, ఈ యాప్ విధానం రద్దు చేసి రైతులకు నేరుగా యూరియా సరఫరా చేయాలని, లేనియెడల రైతులను ప్రజలను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కోమాండ్ల గురువయ్య, నల్లబోతు సోమయ్య, మల్లికాంటి చంద్రశేఖర్, వెంపటి మహేష్, ముత్యాల కేశవులు కోమాండ్ల ఆంజనేయులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## 30వ వార్డులో కాంగ్రెస్ విజయం

**-చందా రాజు వార్డు ప్రజలకు కృతజ్ఞతలు**

**జమ్మికుంట -13ఫిబ్రవరి (మహాప్రభ)**



జమ్మికుంట 30 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచిన చందా రాజు విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన 30వ వార్డు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, "నాపై నమ్మకం ఉంచి గెలిపించిన 30 వ వార్డు ప్రజలకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. మీ ఆశీస్సులు, మీ మద్దతు నన్ను ఈ విజయానికి చేర్చాయి. ఈ గెలుపు నా వ్యక్తిగత విజయం కాదు, వార్డు ప్రజలందరి గెలుపు" అని పేర్కొన్నారు. తన విజయంలో సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు వార్డు ప్రజలందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. 30 వ వార్డును ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తానని చంద రాజు స్పష్టం చేశారు.

## ఇందారం పాఠశాలలో ఆంగ్లభాషా దినోత్సవ వేడుకలు.



**మంచిర్యాల -13ఫిబ్రవరి (మహాప్రభ)**
జైపూర్ మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీమతి సరోజినీ నాయుడు గారి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం రోజున ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాల అలంకరణతో నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి బి. శ్రీనివాస్ గారు మాట్లాడుతూ గ్లోబల్ భాషగా గుర్తింపు పొందిన ఆంగ్లభాషలో ప్రతి ఒక్కరు పట్టు సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయడం ద్వారా స్ఫూర్తి పొందాలన్నారు. సరోజినీ నాయుడు గారు తమ రచనల ద్వారా ఎంతో మంది ప్రజలను చైతన్యవంతం చేశారని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత ఆశయాలను లక్ష్యాలుగా పెట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, స్పెల్ బి, పోస్టర్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్ తదితరు అంశాల మీద పోటీల నిర్వహించారు. అనంతరం జరిగిన విద్యార్థుల సంస్కృత కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు ఏం. విజయలక్ష్మి, డి.సహదేవ్ లతో పాటుగా కె .రమాదేవి, కె. రమేష్ బాబు, జి చక్రధర్, పి. మంజుల, జి. సంధ్యారాణి, ఎన్. పద్మ, జి రవీందర్, కె. కనకయ్య, అరుణ్ లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అయిజ మున్సిపాలిటీ 7వ వార్డ్ బిఆర్ఎస్ అభ్యర్థి బి సరోజమ్మ గెలుపు

**జోగులాంబ-13ఫిబ్రవరి (మహాప్రభ)**
జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలలో అఖండ విజయం సాధించిన 7 వ వార్డు బి ఆర్ ఎస్ అభ్యర్థి బి సరోజమ్మ
కాంగ్రెస్ అభ్యర్థి పవిత్ర గారిపై 579 ఓట్ల మెజార్టీతో నన్ను గెలిపించిన వార్డు ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. వార్డులో ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్యను పరిష్కరిస్తానని తెలియజేశారు.



# బిజినెస్

## మహిళలకు గుడ్‌న్యూస్.. భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు.

### ఎంతో తెలిస్తే ఆశ్చర్యపోతారు!



బంగారం ప్రియులకు గుడ్‌న్యూస్.. మళ్లీ భారీగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరల నుంచి ఉపశమనం లభించింది. తులం బంగారంపై భారీగా తగ్గుముఖం పట్టింది.తాజాగా ఫిబ్రవరి 13న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై ఏకంగా 2,620 రూపాయలు తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై 2,400 వరకు తగ్గింది.ధరలు తగ్గిన తర్వాత 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,55,780 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,42,800 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా రికార్డు స్థాయిలో పెరుగుతున్న వెండి ధరపై భారీగా తగ్గింది. కిలో సిల్వర్‌పై ఏకంగా 15 వేల రూపాయలు తగ్గుముఖం పట్టింది. ధర తగ్గిన తర్వాత కిలో వెండి ధర 2,80,000లకు చేరుకుందిధరలు తగ్గిన తర్వాత ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,780 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,42,800 వద్ద కొనసాగుతోంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో కిలో వెండి ధర రూ.2,80,000 వద్ద ట్రేడవుతోంది.

### ఆఫర్ మామూలుగా లేదుగా.. ఈ కారుపై రూ.3,85,000 తగ్గింపు.. భారీ డిస్కౌంట్!




2025 మోడల్ కారుపై రూ.3.80 లక్షల వరకు తగ్గింపుతో అందుబాటులో ఉంది. అయితే 2026 మోడల్ కారుపై రూ.3.30 లక్షల వరకు తగ్గింపుతో అందుబాటులో ఉంది. ఈ వాహనం ధర రూ.17.50 లక్షల నుంచి రూ.22.25 లక్షలు (ఎక్స్-షోరూమ్) మధ్య ఉంది. ఇది ఒక్కసారి ఛార్జ్ చేస్తే 585 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు.టాటా హారియర్ EV డిస్కౌంట్: టాటా 2025-2026 మోడళ్లపై రూ.1.50 లక్షల వరకు తగ్గింపును అందిస్తోంది. ఈ వాహనం ధర రూ.21.50 లక్షల (ఎక్స్-షోరూమ్) నుండి రూ.30.24 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటుంది.టాటా పంచ్ జువ డిస్కౌంట్: 2025 మోడల్‌పై రూ.1.60 లక్షల వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉండగా, 2026 మోడల్‌పై రూ.90,000 వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ మైక్రో SUV ధర రూ.10 లక్షల నుంచి రూ.14.45 లక్షలు (ఎక్స్-షోరూమ్) మధ్య ఉంది. ఇది ఒక్కసారి ఛార్జ్ చేస్తే 421 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు.టాటా నెక్సాన్ EV డిస్కౌంట్: టాటా అత్యంత ప్రజాదరణ పొందిన ఎలక్ట్రిక్ మోడళ్లలో ఒకటైన నెక్సాన్ EV 2025 మోడల్ సంవత్సరంలో రూ.1.20 లక్షల వరకు డిస్కౌంట్లతో అందుబాటులో ఉంది. 2026 మోడల్ సంవత్సరం రూ.30,000 వరకు చిన్న ప్రయోజనాలను అందిస్తుంది. ధరలు రూ.12.49 లక్షల నుండి రూ.17.49 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటాయి.టాటా టియాగో EV డిస్కౌంట్: టాటా నుండి వచ్చిన ఈ ఎంట్రీ-లెవల్ ఎలక్ట్రిక్ హ్యాచ్‌బ్యాక్ 2025 మోడల్ ఇయర్‌పై రూ.1.50 లక్షల వరకు డిస్కౌంట్‌తో అందుబాటులో ఉంది. 2026 మోడల్ పై రూ.60,000 వరకు ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ధరలు రూ.7.99 లక్షల నుంచి రూ.11.14 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉన్నాయి. ఇది ఒక్కసారి ఛార్జ్ చేస్తే 315 కి.మీ వరకు ప్రయాణించగలదు.

## హెచ్‌యూఎల్ లాభం రెండింతలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13


హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్(హెచ్‌యూఎల్) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.6,604 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది.కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,989 కోట్లతో పోలిస్తే రెండింతలు పెరిగింది. ఐస్‌క్రీం వ్యాపారాన్ని విడగొట్టి ప్రత్యేక సంస్థగా తీర్చిదిద్దడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని పేర్కొంది. కంపెనీ విక్రయాలు 5.71 శాతం ఎగబాకి రూ.16,197 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి వెల్లడించింది




# స్పోర్ట్స్

## జడేజాకు చుక్కెదురు.. రాజస్థాన్ రాయల్స్ సారథిగా ఆటిట్యూడ్ స్టార్..!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంఛైజీ రాజస్థాన్ రాయల్స్ కొత్త కెప్టెన్ ఎవరు? అనే ప్రశ్నకు తెరపడింది. సుదీర్ఘ కాలం జట్టుతో కొనసాగుతున్న రియాన్ పరాగ్ కే పగ్గాలు అప్పగించింది యాజమాన్యం. దాంతో, పంతొమ్మిదో సీజన్ వేలానికి ముందు ట్రేడ్ పద్ధతిలో సొంత గూటికి చేరిన రవీంద్ర జడేజా ఐపీఎల్ కెప్టెన్సీ కల చెదిరింది. నిరుడు సంజూ శాంసన్ గైర్హాజరీలో గులాబీ టీమ్‌ను నడిపించిన అతడికే యాజమాన్యం జై కొట్టిందని సమాచారం. ఈ విషయాన్ని శు క్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది రాజస్థాన్ ఫ్రాంఛైజీ.పద్దెనిమిదో సీజన్ అనంతరం రాజస్థాన్ జట్టుకు సంజూ శాంసన్(ఝఅయబ ఝఎంశీఅ) గుడ్ బై చెప్పడంతో తదుపరి సారథి? అనే చర్చ మొదలైంది. ట్రేడ్ పద్ధతిలో జట్టులోకి వచ్చిన రవీంద్ర జడేజాకు కెప్టెన్సీ ఇస్తారని.. రియాన్ పరాగ్, యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్ కూడా




రేసులో ఉన్నారని కథనాలు వచ్చాయి. కానీ, చివరకు జడ్డూను కూడా కాదని పరాగ్ నయా సారథిగా ఎంపికయ్యాడు. పంతొమ్మిదో సీజన్‌లో అతడి నాయకత్వంలోనే రాజస్థాన్ ఆడనుంది.

**వార్న్ కెప్టెన్సీలో**

ఇప్పటివరకూ రాజస్థాన్‌కు ఐదుగురు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆరంభ సీజన్‌లో దివంగత షేన్ వార్న్ కెప్టెన్సీలో ఆడిన రాజస్థాన్ ట్రోఫీని కొల్లగొట్టింది. 2012, 13వ సీజన్‌లో రాహుల్ ద్రవిడ్. 2014-15లో స్టీవ్ స్మిత్ సారథిగా సేవలందించారు. 2018-19లో అజింక్య రహానే.. అనంతరం మళ్లీ 2019-20 సీజన్లలో స్మిత్ పగ్గాలు స్వీకరించారు. 2021లో రాజస్థాన్ సారథిగా సంజూ శాంసన్ ఎంపికయ్యాడు. శాంసన్ నాయకత్వంలో దుమ్మురేపిన రాజస్థాన్ ఫైనల్ ఆడింది.అయితే.. గత రెండు సీజన్లలో ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరలేకపోయింది. పద్దెనిమిదో సీజన్‌లో సంజూ గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరమవ్వగా.. రియాన్ పరాగ్ జట్టును అద్భుతంగా నడిపించాడు. పద్నాలుగేళ్ల వైభవ్ సూర్యవంశీ ఓపెనర్‌గా రికార్డు సెంచరీతో మెరవడం.. కెప్టెన్‌గా పరాగ్ రాణించడం శాంసన్కు ప్రతిబంధకంగా మారాయి. కొత్త జట్టుకు ఆడడమే మంచిదని భావించిన అతడు.. పంతొమ్మిదో సీజన్ వేలానికి ముందే ట్రేడ్ పద్ధతిన చెన్నైకి వెళ్లాడు. బదులుగా రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను తీసుకుంది రాజస్థాన్.

## పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశం ఉంది : వరుణ్ చక్రవర్తి




**న్యూఢిల్లీ**

టీ20 వరల్డ్‌కప్‌లో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అభిషేక్.. గురువారం నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఆడని విషయం తెలిసిందే. అయితే అభిషేక్ శర్మ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉన్నట్లు వరుణ్ చెప్పాడు. ఆరోగ్యం క్షీణించడం వల్ల రెండు రోజుల పాటు అభిషేక్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అభిషేక్‌తో మాట్లాడానని, అతను బాగానే ఉన్నాడని, ఇవాళ కొంత ప్రాక్టీస్ చేశాడని, సిద్ధం అవుతున్నట్లు అతను చెప్పాడని వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు.నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రెండు ఓవర్లు వేసి 7 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఆ మ్యాచ్ టాస్ వేసిన సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు అభిషేక్ శర్మ మిస్సయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అభిషేక్ శర్మ గైర్హాజరీలో నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టాడు.వరల్డ్‌కప్‌లో ఇండియా వరుసగా తన రెండో మ్యాచ్ నెగ్గింది. నమీబియాపై 93 రన్స్ తేడాతో నెగ్గింది. ఒకవేళ కొలంబోలో జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ పాల్గొంటే అతను పాక్‌తో మ్యాచ్‌కు ఆడేది లేనిది తేలే అవకాశం ఉంటుంది. నెట్స్‌లో చాలా సమయం అతను బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ఇండోపాక్ మ్యాచ్‌పై క్లారిటీ వస్తుంది.

## టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాకు షాక్.. జింబాబ్వే సంచలన విజయం

**కొలంబో**

టీ20 వలర్డ్‌కప్ లో సంచలన నమోదు అయ్యింది. కొలంబోలో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 రన్స్ తేడాతో జింబాంబే విక్టరీ కొట్టింది. జింబాబ్వే క్రికెటర్లు అద్భుతమైన ఆటను ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అత్యధికంగా 64 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు ఉన్నాయి. జింబాబ్వే బ్యాటర్లలో మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 రన్స్ స్కోరు చేశారు. జింబాబ్వే 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 125 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. కానీ ఆసీస్ బౌలర్లు రాణించడంతో చివరి అయిదు ఓవర్లలో జింబాబ్వేకు 44 రన్స్ మాత్రమే వచ్చాయి.జింబాబ్వే విసిరిన టార్గెట్‌ను అందుకునే క్రమంలో




ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. అనూహ్య రీతిలో ఓటమిని ఎదుర్కొన్నది. 19.3 ఓవర్లలో 146 రన్స్ చేసి ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా 65, మ్యాక్స్‌వెల్ 31 రన్స్ చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్‌బానీ 4, బ్రాడ్ ఇవాన్స్ 3 వికెట్లు తీసుకున్నారు. చేజింగ్‌లో కేవలం 29 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా.ఆ




తర్వాత అయిదో వికెట్‌కు మ్యాక్స్‌వెల్, రెన్‌షా 77 రన్స్ జోడించారు. కానీ ఆసీస్ మేటి బ్యాటర్లు జట్టకు విజయాన్ని అందించలేకపోయారు. 4 ఓవర్లలో 17 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్న ముజరబానీ .. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అతను వంద వికెట్ల తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు.




## ఓటిటిలోనూ మనశంకర వరప్రసాద్ గారు దూకుడు

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్‌లలో సందడి చేసి రికార్డులు సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం నెల రోజుల తర్వాత ఫిబ్రవరి 11న జీ5 వేదికగా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. అక్కడ కూడా ఒక్క రోజులోనే రికార్డును సృష్టించింది. ఏకంగా 24 గంటల్లో 200 మిలియన్ల మినిట్స్‌ను సొంతం చేసుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ఇది ఓ కొత్త రికార్డ్ అని సంస్థ జీ5 సంస్థ వెల్లడించింది. థియేటర్‌లోనే కాదు.. ఓటీటీలోనూ మరిన్ని రికార్డులు తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా రూ.375 కోట్లు వసూలు చేసి చిరు కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల లిస్ట్‌లో చేరింది. ఈ విజయంపై చిరంజీవి గతంలో మాట్లాడారు. 'వెండితెర మీద నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే శక్తి. రికార్డులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ, మీరు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం' అని అన్నారు. నయనతార హీరోయిన్‌గా కనిపించిన ఈ చిత్రంలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించి నవ్వులు పూయించారు.

## ఇది అరుదైన కలయిక



'ఇందులో నా పాత్ర పేరు మిత్ర. తను సరదాగా ఉండే మధ్యతరగతి అమ్మాయి. బాగా మాట్లాడుతుంది. అనుకున్నది చేసేస్తుంది. కొత్తగా ఆలోచిస్తుంది. జాబ్ కోసం చెన్నై వస్తుంది. ఇందులో 'చెప్తా చెప్తా..' అనేది నా ఊతపదం. సినిమా పూర్తయ్యేలోపు ఈ మాట చాలాసార్లు వింటారు. దర్శకుడు అశ్విన్ నా పాత్రను అద్భుతంగా తీర్చిదిద్దారు' అని మానస వారణాసి పేర్కొన్నది.సంతోష్ శోభన్‌కు జోడీగా ఆమె నటించిన రొమాంటిక్ లవ్‌స్టోరీ 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందింది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో మాసన వారణాసి విలేకరులతో ముచ్చటించారు. 'ఆడిషన్ కోసం ఈ టీమ్‌ని కలిశాక, మూవీ మేకింగ్ పట్ల వీరెంత ప్యాషన్‌తో ఉన్నారో తెలిసింది. ఇది రొటీన్ ప్రేమకథ కాదు. మిత్ర, శివల ప్రపంచాలు వేరు. వారి లక్ష్యాలు వేరు. వేరే వేరే ప్రాంతాల నుంచి చెన్నై వస్తారు. అసలు ఇలాంటి జంట కలవడమే అరుదైన విషయం. సంతోష్ మంచి కోస్టార్. సినిమా పట్ల తనకు చాలా ప్యాషన్ ఉంది. తను పట్టుదలగా నటిస్తుంటే పక్కన వాళ్లకు కూడా ఎనర్జీ వస్తుంది. ఇందులో నేను బాగా చేశానంటే కారణం ఓ విధంగా సంతోష్ శోభనే' అని తెలిపింది.




## ఎక్కువ సినిమాలు చేయకపోవడానికి కారణం ఇదే..

హీరోయిన్ శివాని నాగారం గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. షార్ట్ ఫిల్మ్ నుంచి సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ.. ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. లిటిల్ హార్ట్స్ సినిమాతో తెలుగులో పాపులర్ అయ్యింది. ఇప్పుడు హే భగవాన్ సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఈ ముద్దుగుమ్మ మాట్లాడుతూ.. తన ప్రయాణం, కెరీర్ ఎదుగుదలపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన కెరీర్ వృద్ధి గురించి మాట్లాడుతూ, 2024లో నటిగా మంచి అరంగేట్రం చేసి విమర్శకుల ప్రశంసలు అందుకున్నానని, 2025 నాటికి మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నానని, 2026 నాటికి పూర్తి కమర్షియల్ నటిగా మారుతున్నట్లు అనిపిస్తుందని అన్నారు. తాను సినిమాల ఎంపికలో "క్వాలిటీ ఓవర్ క్వాంటిటీ"కి ప్రాధాన్యత ఇస్తానని, ఎన్ని సినిమాల్లో నటించామన్నది కాదని, ఎలాంటి కంటెంట్ ఉన్న సినిమాల్లో నటించామన్నదే ముఖ్యమని నమ్ముతానని వెల్లడించారు.ప్రస్తుతం తాను నటిస్తున్న హే భగవాన్ చిత్రం గురించి మాట్లాడుతూ, సినిమాలో ఒక మిస్టరీ బిజినెస్ ఉందని, సుహాస్ వాయిస్‌తో వచ్చే డిస్‌క్లెయిమర్ వల్ల దానిపై ప్రేక్షకుల్లో తీవ్రమైన ఆసక్తి నెలకొందని తెలిపారు. ఆ బిజినెస్ ఏమిటని చాలా మంది అడుగుతున్నారని, అయితే అది సినిమా చూస్తేనే దాని కిక్ తెలుస్తుందని, మొదటి అర్ధభాగంలోనే ఆ రహస్యం వీడుతుందని శివాని పేర్కొన్నారు.ఈ చిత్రంలో తన పాత్ర ఒక సాంప్రదాయక, పద్ధతైన కుటుంబానికి చెందిన అమ్మాయి అని, తన తల్లిదండ్రులు తెలుగు భాషను బాగా ఇష్టపడతారని వివరించారు. ఇప్పుడే కెరీర్ స్టార్ట్ అయింది కదా.. నేనింకా యాక్టింగ్ లో చాలా నేర్చుకోవాలి. నిత్యవిద్యార్థినిగా ఉండేందుకు సిద్ధంగా ఉంటాను. నా దృష్టిలో సినిమాలు, వెబ్ సిరీస్‌లు రెండూ గొప్పవే. నటిగా నన్ను మలచుకుంటూ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తాననే నమ్మకం నాకుంది. తెలుగు అమ్మాయిలు ఇండస్ట్రీలోకి రావాలి. వచ్చి మంచి సక్సెస్ ఫుల్ సినిమాలు చేయాలని ఎప్పుడూ కోరుకుంటాను. కాలేజీ రోజుల్నుంచే నాకు యాక్టింగ్ అంటే ఇష్టం ఉండేది. దాన్ని మా కుటుంబ సభ్యులూ ప్రోత్సహించారు. వాళ్లు నన్నెప్పుడూ సపోర్ట్ చేస్తూనే ఉంటారు అని చెప్పుకొచ్చింది.

## తమ్ముడి హల్దీ వేడకను మిస్ అయ్యా

### ఇన్‌స్టాలో అల్లు అర్జున్ పోస్ట్



అల్లు అర్జున్ తమ్ముడు, టాలీవుడ్ హీరో అల్లు శిరీష్ త్వరలోనే ఒక ఇంటివాడు కాబోతున్న విషయం తెలిసిందే. గత కొద్దిరోజులుగా అల్లు వారి ఇంట్లో పెళ్లి సందడి మొదలవ్వగా, తాజాగా జరిగిన శిరీష్ హల్దీ వేడుక సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే తన తమ్ముడి జీవితంలోని ఈ ముఖ్యమైన ఘట్టానికి అన్న అల్లు అర్జున్ హాజరుకాలేకపోయాడు. ప్రస్తుతం అట్లీ సినిమా షూటింగ్ పనుల్లో దేశం వెలుపల బిజీగా ఉండటం వల్లే బన్నీ ఈ వేడుకకు దూరంగా ఉండాల్సి వచ్చిందని తెలుస్తోంది.ఈ క్రమంలోనే అల్లు అర్జున్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. తమ్ముడి హల్దీ ఫోటోను పోస్ట్ చేస్తూ.. 'ఐ మిస్డ్ బీయింగ్ హియర్' అంటూ తన ఆవేదనను వ్యక్తపరిచారు. శిరీష్ తన చిరకాల స్నేహితురాలు నయనికాను వివాహం చేసుకుంటున్న నేపథ్యంలో, ఈ జంటకు బన్నీ తన ప్రేమపూర్వక ఆశీస్సులు అందజేశారు. బన్నీ లేకపోయినా ఆయన భార్య స్నేహ రెడ్డి, పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా, రామ్ చరణ్ సతీమణి ఉపాసన తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. హల్దీ వేడుకను మిస్ అయినప్పటికీ, త్వరలో జరగబోయే గ్రాండ్ వెడ్డింగ్‌కు మాత్రం అల్లు అర్జున్ తప్పకుండా హాజరవుతారని కుటుంబ వర్గాలు చెబుతున్నాయి.

## వాట్సాప్ వాడను.. ఫేస్‌బుక్‌కు ఎప్పుడో గుడ్‌బై చెప్పేశా



ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు స్మార్ట్‌ఫోన్ చేతిలో లేనిదే గడవని పరిస్థితి నెలకొంది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతి ఒక్కరూ ఎక్స్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో గంటల తరబడి గడుపుతూ వర్చువల్ ప్రపంచంలో మునిగితేలుతున్నారు. అయితే వీరందరికీ భిన్నంగా తనకంటూ ఒక ప్రత్యేకమైన జీవనశైలిని ఏర్పరచుకుని అందరినీ ఆశ్చర్యపరుస్తోంది స్టార్ హీరోయిన్ రజిషా విజయన్.తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాల తార.. గత ఎనిమిదేళ్లుగా వాట్సాప్‌ను ఉపయోగించడం లేదని తెలిపి అందరినీ షాక్‌కి గురిచేసింది. కాలేజీ చదువు పూర్తికాగానే ఫేస్‌బుక్‌కు గుడ్‌బై చెప్పేసిన ఆమె ప్రస్తుతం కేవలం ఇన్‌స్టాగ్రామ్‌ను మాత్రమే చాలా అరుదుగా వాడుతున్నట్లు తెలిపింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రజిషా తన వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలను పంచుకుంటూ.. సోషల్ మీడియా మాయలో పడి విలువైన సమయాన్ని వృధా చేసుకోవడం కంటే, నిజ జీవితానికే ప్రాధాన్యత ఇవ్వడం తనకు ఇష్టమని స్పష్టం చేసింది. వర్చువల్ బంధాల కంటే ప్రత్యక్షంగా మనుషులతో గడపడమే మిన్న అని ఆమె పేర్కొంది. మాస్ మహారాజా రవితేజ సరసన 'రామారావు ఆన్ డ్యూటీ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రజిషా, తన నటనతో మరియు క్యూట్ లుక్స్‌తో మంచి మార్కులు కొట్టేసింది. ఇటీవల మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన బ్లాక్ బస్టర్ హిట్ 'కాలంకావల్' చిత్రంలోనూ కీలక పాత్ర పోషించి మెప్పించింది. సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న ఈ మలయాళ ముద్దుగుమ్మ, సోషల్ మీడియా విషయంలో తీసుకున్న ఈ సంచలన నిర్ణయం ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్ అయింది. సోషల్ మీడియా ప్రపంచానికి దూరంగా ఉంటూ కూడా కెరీర్‌లో ఎలా రాణించవచ్చో రజిషా విజయన్ నిరూపిస్తోందని నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com